ప్రజాశక్తి
ఆదివారం 14 ఏప్రిల్ 2024
8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా





సిఎంపై దాడితో కలకలం

సిసి ఫుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు

పలుచోట్ల గజమాలలు, టపాసులతో జగన్ బస్సు యాత్రకు ఘన స్వాగతం

సిఎం జగన్‌పై దాడి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. విజయవాడ సింగ్‌నగర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు రాయితో దాడి చేయడం కలకలం రేపింది. ఆ పార్టీ శ్రేణులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. దాడి జరిగిన డాబాకొట్లు సెంటర్‌లో ఓవైపు స్కూల్, మరోవైపు భవనాలు ఉన్నాయి. పాఠశాల భవనం పక్క నుంచి రాయి వచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ ప్రాంతంలోని సిసి ఫుటేజీని పరిశీలిస్తున్నారు. మరోవైపు నగరంలో సాగిన బస్సు యాత్రలో పలుచోట్ల సిఎం జగన్‌కు భారీ క్రేన్లతో గజమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. సీఎం జగన్ వాహనంపై పూల వర్షం కురిపించారు టపాసులతో స్వాగతం పలికారు. దాడి సంఘటన అనంతరం ఆయనకి వైద్యులు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం జనగ్ బస్సులోనే కూర్చొని యాత్రను కొనసాగించారు. డాబాకొట్లు సెంటరు నుండి కృష్ణా హోటల్, పైపుల రోడ్డు జంక్షన్ వరకు ఆయన బస్సులోనే ఉండిపోయారు. ఆ తర్వాత పైపుల రోడ్డు సెంటరులో మళ్లీ ఆయన బస్సుపైకి ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు.



గాయపడిన సిఎం

ప్రజాశక్తి - విజయవాడ, అర్బన్, సింగ్‌నగర్, గన్నవరం : వైసిపి అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర శనివారం సాయంత్రం విజయవాడ మీదుగా సాగింది. మధ్యాహ్నం 2.30 గంటలకు రావాల్సిన బస్సు యాత్ర రెండు గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.30 గంటలకు కనకదుర్గ వారధి మీదుగా విజయవాడ చేరుకుంది. వారధి వద్ద వైసిపి విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్ నాని, విజయవాడ తూర్పు, సెంట్రల్, పశ్చిమ, జగ్గయ్యపేట, నందిగామ అభ్యర్థులు దేవినేని అవినాష్, వెలంపల్లి శ్రీనివాస్, షేక్ ఆసిఫ్, మొండితోక జగన్మోహనరావు, సామినేని ఉదయభాను, ఎంఎల్‌సి రహుల్లా, వైసిపి నాయకులు పోతిన వెంకట మహేష్ తదితరులు ఘన స్వాగతం పలికారు. వారధి వరకు బస్సులో ఉన్న జగన్ విజయవాడ నగరంలోకి



నగరంలో జరిగిన బస్సు యాత్రలో అభివాదం చేస్తున్న సిఎం జగన్మోహనరెడ్డి

ప్రవేశించగానే బస్సు ఓపెన్ టాప్‌పైకి ఎక్కి ప్రజలకే అభివాదం చేస్తూ ముందుకు సాగారు. వారధి నుండి నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంతెన మీదుగా ఆస్టర్ రమేష్ హాస్పటల్స్ నుండి ఎం.జి.రోడ్డు దాటుకుని శిఖామణి సెంటర్ వరకు సిఎం అభివాదం చేస్తూ ముందుకు సాగారు. దారి పొడవునా, మహిళలు, స్థానికులు పెద్ద సంఖ్యలో సిఎంను చూడటానికి వచ్చారు. ఈ ఘటన చోటుచేసుకున్న సమయములో సిఎంతోపాటు విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి, ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని), విజయవాడ సెంట్రల్, తూర్పు, పశ్చిమతోపాటు ఎన్‌టిఆర్ జిల్లాలోని ఆయన నియోజకవర్గాల అభ్యర్థులు వెలంపల్లి శ్రీనివాస్, దేవినేని అవినాష్, ఎస్‌కె ఆసిఫ్, సామినేని ఉదయభాను, ఇటీవల జనసేన నుండి వైసిపిలో చేరిన పోతిన వెంకట మహేష్, కాపు కార్పొరేషన్

(మిగతా 2లో)

సిఎం జగన్‌కు భద్రత పెంచాలి : కేశినేని నాని

ప్రజాశక్తి - గన్నవరం : విజయవాడలో సీఎం జగన్మోహన్ రెడ్డి పై రాయితో దాడి చేసిన వ్యవహారాన్ని చాలా సీరియస్ గా పరిగణించాలి, దీనిని ఎలక్షన్ కమిషన్ దష్టికి తీసుకు వెళతాం, జగన్కు సెక్యూరిటీ భారీగా పెంచాల్సిన అవసరం కనిపిస్తుందని విజయవాడ వైసిపి పార్లమెంట్ అభ్యర్థి కేసినేని నాని చెప్పారు. ఆది శనివారం గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో జగన్ బస శిబిరం వద్ద విలేకర్లతో నాని మాట్లాడారు. విజయవాడలో బస్సు యాత్రకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఒక పథకం ప్రకారం చంద్రబాబు వెనుక ఉండి ఈ దాడి

(మిగతా 2లో)



ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

ఎన్‌టిఆర్ సంక్షేమ పథకాలే చంద్రబాబుకు స్ఫూర్తి

వార్త మెయిన్‌లో

'నిజం గెలవాలి' ముగింపు సభలో నారా భువనేశ్వరి

నేడు 'ఉద్యమాల ఒడిలో యార్లగడ్డ జోయ' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - చందర్లపాడు

ఎన్‌టిఆర్ జిల్లా కేంద్రమైన చందర్లపాడు ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు "ఉద్యమాల ఒడిలో యార్లగడ్డ జోయ" పుస్తకావిష్కరణ జరుగుతుంది. ఈ పుస్తకాన్ని ఎపి రాష్ట్ర రాజ్యాంగ హక్కుల వేదిక కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు ఆవిష్కరిస్తారు. సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యాన జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

పిఒ, ఎపిఒలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్నికల నిర్వహణలో అత్యంత ముఖ్యమైన పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడంలో ప్రిసైడింగ్ అధికారులు (పీవో), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీవో) కీలకమని.. మాస్టర్ ట్రైనర్లు ఇచ్చే శిక్షణను పీవోలు, ఏపీవోలు సద్వినియోగం చేసుకొని, సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఎస్.డిల్లీరావు సూచించారు. శనివారం నగరంలోని పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాలలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి పీవో, ఏపీవోల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ డిల్లీరావు ప్రారంభించి మాట్లాడారు. పోలింగ్ రోజుకు ముందు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ దగ్గర నుంచి తిరిగి పోలింగ్ పూర్తిచేసుకుని రిసెప్షన్ సెంటర్ వరకు అన్ని అంశాలపైనా క్షుణ్నంగా అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్ల విషయంలో ప్రత్యేకంగా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ డిల్లీరావు సూచించారు. శిక్షణ కార్యక్రమంలో కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఆర్‌వో కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న కలెక్టర్ డిల్లీరావు

1,216 ఫిర్యాదుల పరిష్కారం

జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఓటర్ హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్ (ఎన్‌జీఎస్‌పీ) తదితర మార్గాల ద్వారా 1,250 ఫిర్యాదులు రాగా 1,216 ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ పూర్తయిందని, మిగిలినవి పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ ఎస్.డిల్లీరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓటరు హెల్ప్‌లైన్ (1950) ద్వారా 195 ఫిర్యాదులు రాగా 195 ఫిర్యాదుల పరిష్కారం పూర్తయిందన్నారు. ఎన్‌జీఎస్‌పీ ద్వారా 384 ఫిర్యాదులు రాగా 374 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. అదే విధంగా వాట్సాప్ నంబరు (9154970454) ద్వారా 29 ఫిర్యాదులు రాగా 26 ఫిర్యాదులు, కాల్ సెంటర్ (0866-2570051) ద్వారా 22 ఫిర్యాదులు రాగా 22 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు.



టిడిపిలోకి వైసిపి నేత మౌలాలి

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ టిడిపి అభ్యర్థి వెనిగండ్ల రాము సమక్షంలో వైసిపి సీనియర్ నాయకుడు షేక్ మౌలాలి టిడిపిలో చేరారు. శనివారం 11వ వార్డు ఎన్నికల ప్రచారంలో మౌలాలికు పార్టీ కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. టిడిపి కంచుకోటలైన లింగవరంతో మొదలై మొన్న జొన్నపాడు, నిన్న వడ్లమన్నాడు, నేడు గుడివాడ ప్రాంతాలు మారిన ప్రవాహంలో టిడిపిలో చేరుతున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, పట్టణ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రామాబాబు, టిడిపి నాయకులు పట్టపు చిన్న తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో హిందూ మాల, క్రిస్టియన్ మాలల పరిరక్షణ సమైక్య సంఘం ఆధ్వర్యంలో డా॥బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు కర్రా గాబ్రియేలు తెలిపారు. శనివారం స్థానిక శ్రీలేఖ హోటల్ సమీపంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 14వ తేది అంబేద్కర్ జయంతి వేడుకలు సందర్భంగా స్థానిక నెహ్రుచౌక్‌లో మజ్జిగా కేంద్రాన్ని 1 టౌన్ సిఐ ఇంద్ర శ్రీనివాసరావు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : బండి రామకృష్ణ

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : వైసిపి అరాచక పాలనను తరిమి కొట్టి ఎన్డీయే కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మచిలీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ సూచించారు. శనివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయం లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మచిలీపట్నం పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కార్యదర్శిగా తనను కృష్ణా జిల్లా ఏడు నియోజకవర్గాలలో ఇన్‌చార్జులుగా అక్కల రామ్మోహన్రావు,టోనీ పార్వతి, పంచకర్ల సందీప్, చిలకలపూడి పాపారావు, బాడిత శంకర్, అజయ్ వర్మ,ఠాకూర్ లను నియమించడం జరిగిందన్నారు.

అంబేద్కర్‌కు ఘనంగా నివాళులర్పిద్దాం

ప్రజాశక్తి - విజయవాడ : స్వేచ్ఛ స్వాతంత్ర్యాలకు దిశా నిర్దేశం చేసి భారత రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ భీమ్రావు రాంజీ అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా నివాళులర్పించేందుకు ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ ఎస్. దిల్లీరావు తెలిపారు. ఇందులో భాగంగా స్వరాజ్య మైదానంలోని 125 అడుగుల ఎత్తు అంబేద్కర్ విగ్రహం ప్రాంగణంలో సందర్శకులు, సామాజికవేత్తలు, అంబేద్కర్ వాదులు ఆయనకు నివాళులు అర్పించేలా ఆయన తాత్కాలిక విగ్రహాన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. దిల్లీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో నివాళు లు అర్పించేందుకు విచ్చేసే అంబేద్కర్ అభిమానులు, సామాజిక సంఘాల నాయకులు ప్రవర్తన నియమావళి ని దష్టిలో పెట్టుకుని నివాళులు అర్పించాలని కోరారు.

దోష రహితంగా ఇవిఎంల కేటాయింపు ప్రక్రియ

- జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : తొలి విడత ర్యాండమైజేషన్ ద్వారా పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంల కేటాయింపు ప్రక్రియ సజావుగా, దోష రహితంగా జరిగినట్లు కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన ర్యాండమైజేషన్ ప్రక్రియ ఆధారంగా గొల్లపూడి ఈవీఎం గోదాము వద్ద పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంల కేటాయింపు ప్రక్రియ ప్రారంభం కాగా.. శనివారం కూడా ఇది కొనసాగింది. జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు.. జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులతో కలిసి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత పకడ్బందీగా రిటర్నింగ్ అధికారులు.. సహాయ సిబ్బందితో సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ముందుకు నడిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ర్యాండమైజేషన్‌లో నియోజకవర్గాలకు అనుసంధానమైన ఈవీఎంలను వేరుచేసి, ప్రత్యేక నంబరింగ్ ఇవ్వడం, స్కానింగ్ చేయడం, బాక్సింగ్, తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ లకు ట్రాన్స్‌పోర్టింగ్.. ఇలా ప్రతిదశలోనూ అప్రమత్తంగా వ్యవహరించినట్లు తెలిపారు. మొత్తం 1,781 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 20 శాతం రిజర్వ్‌తో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్లు అందించడం జరుగుతోందని.. అదే విధంగా 30 శాతం రిజర్వ్‌తో వీవీప్యాట్‌లను



అందుబాటులో ఉంచనున్నట్లు వివరిం చారు. హమాలీలు మంచి సేవలు అందించారని.. వేసవి నేపథ్యంలో వారికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియలో భాగస్వాములైన ఆర్‌వోలు, సహాయ సిబ్బంది ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్‌డీవో, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఆర్‌వో బీహెచ్ భవానీ శంకర్, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఆర్‌వో కిరణ్మయి, తిరువూరు ఆర్‌డీవో కె.మాధవి, నందిగామ ఆర్‌డీవో ఎ.రవీంద్రరావు, జగ్గయ్యపేట ఆర్‌వో జి.వెంకటేశ్వర్లు, ఈవీఎం నోడల్ అధికారి జి. మహేశ్వర రావు, ఎన్నికల సెల్ సూపరిం టెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



సిఎంపై దాడితో కలకలం

(మొదటి పేజీ తరువాయి)

చైర్మన్ అడపాశేషు తదితరులు ఉన్నారు. సిఎంకు గాయం కావడంతో వైసిపి శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశాయి. అగంతకులను గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు.

భారీ వర్షం.. ఈదురు గాలులు...

మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో నగరంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై విపరీతమైన దుమ్ము, ధూళిగాలితో పాటు భారీ వర్షం పడింది. అప్పటికే ముఖ్యమంత్రి కోసం వేచి చూస్తున్న స్థానికులు, పార్టీ కార్యకర్తలు వర్షం వస్తున్నా అలాగే వేచి ఉన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో జనం వచ్చారు. దీంతో యాత్ర పొడవునా ప్రజలతో కిక్కిరిసిపోయింది.

ఆలస్యంగాసాగిన బస్సుయాత్ర

కనక దుర్గ వారధి మీదుగా శనివారం సాంయత్రం 5.30 గంటలకు సిఎం బస్సు యాత్ర విజయవాడ నగరంలోకి ప్రవేశించింది. ప్రజలకు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పూల వర్షం కురిపించారు. భారీ క్రేన్ల సాయంతో గజమాలలను వేశారు. బస్సు యాత్ర వాటర్ ట్యాంక్ రోడ్, శిఖామణి సెంటరు, చుట్టుగుంట, బిఆర్‌టిఎస్ రోడ్, భగత్‌సింగ్ రోడ్డు మీదుగా సింగ్‌నగర్‌కు చేరుకుంది. అనంతరం కండ్రిక మీదుగా రామవరప్పాడు రింగ్ వద్ద జాతీయ రహదారిపైకి చేరుకుంది. నగరంలో సుమారు మూడున్నర గంటలకుపైగా సాగింది. అనంతరం రామవరప్పాడు, ప్రసాదంపాడు, నిడమానూరు మీదుగా సాగి గన్నవరం మండలం కేసరపల్లి వద్ద కృష్ణాజిల్లాలోకి ప్రవేశించింది. అక్కడ బైపాస్ శివారులో ఏర్పాటు చేసిన రాత్రి బస శిబిరం వద్దకు యాత్ర చేరుకుంది. ఈ యాత్రలో విజయవాడ ఎంపి కేశినేని నాని, పలువురు ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు ఉన్నారు.

కేసరపల్లి చేరిన జగన్ బస్సుయాత్ర

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'సిద్ధం' బస్సుయాత్ర శనివారం రాత్రి పది గంటలకు గన్నవరం నియోజకవర్గంలోని రామవరప్పాడుకు చేరుకుంది. ఆ గ్రామంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జగన్మోహన్ రెడ్డికి స్వాగతం పలికారు. రోడ్డుకి ఇరువైపులా జనాలు నిలబడి జగన్ కు జేజేలు పలికారు. బస్సుపై ఉండి ఆయన చేతులు ఊపుతూ అందరికీ అభివాదం చేశారు. దారి పొడవునా పువ్వులు చల్లారు. అక్కడ నుంచి బస్సు యాత్ర ప్రసాదంపాడు, ఎనికెపాడు, నిడమానూరు మీదుగా గూడవల్లి నుంచి కేసరపల్లి గ్రామంలోని బస శిబిరం వరకు సాగింది. ఆయా గ్రామాల్లో రోడ్డు పక్కన పార్టీ నాయకులు కార్యకర్తలు నిలబడి జగన్ కు స్వాగతం చెప్పారు. జగన్ వెంట మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్, మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి చంద్రశేఖర్ ఉన్నారు. జనాలు జాతీయ రహదారిపైకి రాకుండా చేసేందుకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు నిర్వహించారు. కేసరపల్లి గ్రామంలోకి వాహనాలు రాకుండా గంట పైగా నిలిపివేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. రాత్రి 9 గంటలకు జగన్ యాత్ర వస్తుందని భావించగా 11 గంటల సమయం పట్టింది. దీంతో చాలా మంది జనాలు ఉండలేక ఇళ్లకు వెళ్లిపోయారు. జగన్ బస శిబిరం వద్ద భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు పోలీసులు. జగన్ పై రాయి దాడి జరిగిన నేపథ్యంలో మరింత అలర్ట్ అయ్యారు.

సిఎం జగన్‌కు భద్రత పెంచాలి

చేయించారని అనుకుంటున్నాం. ఇది పక్కా అని భావిస్తున్నాం. నారా లోకేష్ ఒక పథకం ప్రకారమే జగన్ సొంతంగా దాడి చేయించుకున్నాడని సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేస్తున్నాడని, దీని ద్వారా అతని నైజం బయటపడిందని విమర్శించారు. దాడులు చేయించడం చంద్రబాబుకు అలవాటు అన్నారు. విజయవాడ నగరంలో ప్రజాదరణ చూసి ఓర్వలేకే ఈ విధంగా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏం చేసినా జగన్ స్పీడును ఆపలేరన్నారు. నిజం చెప్పాలంటే.. విజయవాడ, గుంటూరులో జగన్ బస్సు యాత్రకు ప్రజల నుంచి వచ్చిన స్పందన చూసి చంద్రబాబు నాయుడు, ఆయన కొడుకు లోకేష్ ఓర్వ లేకపోయారన్నారు. వారి ఆలోచన నుంచే ఈ రాయి దాడి జరిగిందని భావిస్తున్నామని, రాయితో కొట్టిన వ్యక్తిని మాత్రం వదిలే ప్రసక్తి లేదని, పోలీసులు పూర్తిగా దర్యాప్తు చేసి అతన్ని పట్టుకొని వాస్తవాలు బయటకు తీయాలని, ఈ సంఘటనపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. జగన్ బస్సు యాత్రకు జనం అడుగడుగునా స్వాగతం పలికారు. ఇది చూసి ఓరవలేని టిడిపి నేతలు కుట్రపూరితంగా రాయితో దాడి చేయించారు. నీచ రాజకీయాలు చేయడం చంద్రబాబుకు అలవాటే. ఈ రాయి దాడికి చంద్రబాబు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. లేదంటే ప్రజా కోర్టులో ప్రజలే సమాధానం చెబుతారు. చంద్రబాబు ఎన్ని దాడులు, కుట్ర పూరిత ప్రయత్నాలు చేసినా జగన్ విజయాన్ని ఆపలేడు. సిద్ధం సభలకు వస్తున్న జనాన్ని చూస్తుంటే ఆ విషయం అర్థమవుతోంది. గుంటూరు జిల్లాలో జరిగిన సిద్ధం సభ సక్సెస్. విజయవాడలోనూ భారీగా సక్సెస్ అయ్యింది. ఆదివారం కృష్ణాజిల్లా గుడివాడలో జరిగే సిద్ధం సభ పెద్ద ఎత్తున సక్సెస్ అవుతుంది. దీనినీ మీరే చూస్తారు.

కాపునాడు సమావేశంలో వివాదం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నంలో స్థానిక సువర్ణ కళ్యాణ మండపం లో శనివారం సాయంత్రం నిర్వహించిన కాపునాడు సమావేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వంగవీటి మోహన రంగాకు అత్యంత సన్నిహితుడైన చిలంకుర్తి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో కాపునాడు సమావేశాన్ని నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి వైసీపీ మినహా ఇతర రాజకీయ పార్టీలకు చెందిన కాపు నేతలను ఆహ్వానించారు. వైసీపీకి చెందిన పలువురు కాపు నేతలు ఈ సమావేశానికి రాగా నిర్వాహకులు అడ్డుకున్నారు. ఆహ్వానం లేకుండా మా సమావేశానికి ఎలా వస్తారని నిర్వాహకులు ప్రశ్నించగా వివాదం మొదలైంది. తమకు ఆహ్వానం ఉంది కాబట్టే వచ్చామని వైసీపీ నేతలు తేల్చి చెప్పారు. అయితే తాను వైసీపీలోని కాపులకు ఎటువంటి ఆహ్వానాలు పంపలేదని నిర్వాహకుల్లో ఒకరైన చలమలశెట్టి ఆదికిరణ్ తెలిపారు. అయినా వైసీపీ నేతలు అక్కడ నుండి కదలకుండా తమకు సోషల్ మీడియాలో, వాట్సాప్ లలో ఆహ్వానాలు వచ్చాయంటూ వాదనకు దిగారు. ఎవరో పంపితే నాకు సంబంధం ఏమిటని ఆదికిరణ్ తెలిపారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి వివాదాన్ని సర్దుబాటు చేశారు. వైసీపీ నేతలు అక్కడి నుండి వెళ్లిపోవటంతో కాపునాడు సమావేశం యధావిధిగా జరిగింది.

ఐదేళ్లుగా రైతు కంట కన్నీరు



- దీనస్థితిలో ఆక్వా రైతులు, మత్స్యకారులు
- నేడు పెడనలో సిఎం జగన్ పర్యటన

ప్రజాశక్తి-పెడన: దేశానికి వెన్నెముకైనా రైతు నడ్డి విరుగుతోంది. బంగాళాఖాత తీర ప్రాంతాలైన గ్రామాలకు రబీ (దాళ్వా) పంట నోచుకోపోవడంతో దీనస్థితికి చేరుకున్నారు. ప్రభుత్వాలు మారిన తమతమ తలరాతలు మారలేదని తీవ్ర నిరుత్సాహంతో కాలాన్ని వెల్లదీస్తున్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో రైతులకు పెట్టిన పథకాలు అలాగే సబ్సిడీపై రుణాలు అంతేకాకుండా మద్దతు ధర వంటి వాటిలో రైతులకు ఎంతో మేలు జరిగిందని, జగన్మోహన్ రెడ్డి కూడా వ్యవసాయాన్ని పండగ చేస్తారని ఎంతో ఆశతో ఎదురుచూసిన రైతులకు కన్నీరే మిగిలిందని నిరాశ చెందుతున్నారు. నియోజవర్గంలోని పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో దాదాపు 37వేల ఎకరాలకు పైగా వ్యవసాయం సాగు చేస్తున్నారు. వీటిల్లో అధిక శాతం చౌడు భూములు కావడంతో కేవలం వరి పంట మాత్రమే పడుతుంది. ఆరుతడి పంటలైన మినుము, వేరుశనగ అంతంతమాత్రంగానే సాగవుతున్నాయి. అయితే గత ఐదేళ్లుగా రబీ (దాళ్వా) పంట లేకపోవడంతో రైతులు దీనస్థితికి చేరుకున్నారు. అడపాదడప ఆరుతడి పంటలు వేసినప్పటికీ వాటికి ఖర్చులు కూడా రాకపోవడంతో బోరును వినిపిస్తున్నారు. కేవలం వ్యవసాయ రైతులే కాకుండా ఆక్వా రైతులు కూడా కుదేలవుతున్నారు. గత ఐదేళ్లుగా చెరువులకు విద్యుత్ చార్జీలు పెంచడంతో సన్న, చిన్నగా రైతులు రొయ్యలు సాగు చేయడం నిలిపివేశారు. ఎన్నికల ముందు పాదయాత్రలో భాగంగా పెడనకు చేరుకున్న అప్పటి ప్రతిపక్ష నేత ప్రస్తుత ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఆక్వా రైతులకు అప్పటి ప్రభుత్వంలో యూనిట్ ధర రూపాయి 80 పైసలు ఉండేది. దానిని కేవలం రూపాయిన్నరకే అందిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఎన్నికల అనంతరం 25 కెవి విద్యుత్ పై ఒక యూనిట్ ధర రూ.3.80 పైసల నుంచి ఐదు రూపాయల 20 పైసలకు, అలాగే 43 కెవికు రూ. 5.80 పైసల నుంచి 9 రూపాయల వరకు అలాగే వంద కెవి విద్యుత్ ఉపయోగించే వారికి రూ. 6 ల నుంచి 12 రూపాయల వరకు పెంచేశారు. అంతేకాకుండా సర్ చార్జీలు, సర్వీస్ చార్జీలతోపాటు పలు రకాల చార్జీలతో ఆక్వా రైతులపై పెనుభారం మోపారు. దీంతో చేసేదిలేక రైతులు ఆక్వా రంగాన్ని నిలిపివేశారు. దాదాపు కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన మండలాల్లోని పది వేల ఎకరాలకు పైగా ఆక్వా రంగాన్ని నిలిపివేశారు.

ఏడాదిగా మత్స్యకారుల ఎదురుచూపు

కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో మత్స్యకారులు చేపల వేట జీవనధారంగా కొనసాగిస్తున్నారు. అయితే గత అది గత ఏడాది చేపల వేట నిషేధం లో ప్రభుత్వం రావాల్సిన నిధులు నేటికీ రాకపోవడంతో ఏడాది నుంచి ఉన్నారు మరోవైపు గత రెండు రోజులుగా మళ్లీ వెంటనే రావడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. అయితే అటు వ్యవసాయం ఆక్వా అలాగే మత్స్యకారులకు నేడు సీఎం జగన్ మోహన్ రెడ్డి భరోసా ఇస్తారో లేక తూతూ మంత్రంగానే పర్యటించి వెళతారా అన్నది వేచి చూడాల్సిందే.

'సిద్ధం' సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుడివాడ : ఈ నెల 14వ తేదిన గుడివాడలో ముఖ్యమంత్రి వైసిపి అధినేత జగన్మోహనరెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించే మేమంత సిద్ధం బహిరంగ సభ, రోడ్ షోలను విజయవంతం చేయాలని వైసిపి పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మెండా చంద్రపాల్, జిల్లా నాయకుడు మండలి హనుమంతరావు కోరారు. శనివారం స్థానిక ఏలూరు రోడ్డులోని వైసిపి ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన కొడాలి నాని ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నాగవరప్పాడు సమీపంలోని కనకదుర్గమ్మ దేవస్థానం ఎదురుగా గల ఖాళీ స్థలంలో మధ్యాహ్నం మూడు గంటలకు జగన్మోహనరెడ్డి బస్సు యాత్రలో భాగంగా మేమంతా సిద్ధం బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభను వైసిపి కార్యకర్తలు, గృహసారధులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. **పెడన:** శనివారం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పెడనకు రానున్నారు. బస్సు యాత్రలో భాగంగా సాయంత్రం ఐదు గంటలకు పట్టణ శివారు తోటమాలలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద సమావేశం నిర్వహించినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి శాసనసభ అభ్యర్థి ఉప్పాల రాము ఒక ప్రకటనలో తెలిపారు.

పోరాటయోధుడు అంబేద్కర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): పీడీత ప్రజల పక్షాన అనేక పోరాటాలు నిర్వహించిన పోరాట యోధులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని ఎల్ఐసి మచిలీపట్నం డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ జి.సుధాకర్ బాబు అన్నారు. అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా మచిలీపట్నం ఎల్ఐసి ప్రాంగణంలో ఐసిఇయు ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం-విశిష్టత అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సులో సుధాకర్‌బాబు మాట్లాడుతూ రాజ్యాంగ విశిష్టతను, రాజ్యాంగంలోని వివిధ ఆర్టికల్స్ ను ఏవిధంగా పొందుపరిచారో వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిఇయు



మాట్లాడుతున్న సుధాకర్‌బాబు

అధ్యక్షులు జె.సుధాకర్, జి.కిషోర్‌కుమార్, టి. చంద్రపాల్, కె.రాజ శేఖర్, వి.ఠాగూర్, కె.బుల్లయ్య, ఎన్.సుబ్రహ్మణ్యం, రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

చల్లపల్లిలో ఘరాన చోరగాళ్లు

ప్రజాశక్తి-చల్లపల్లి: సినీ పక్కీలో ఇద్దరు వద్దుల నుండి రెండుస్మార్ట్ ఫోన్ లు దొంగిలించిన వెంకటన్న చల్లపల్లిలో జరిగింది . 62 సంవత్సరాలు వయస్సు కలిగిన వృద్ధుడు శనివారం ఉదయం తాసిల్దార్ కార్యాలయం నుండి నారాయణ రావు నగర్ లోని ఇంటికి వెళుతుండగా ఇద్దరు ఘరానా మోసగాళ్లు బైక్ పై వెంబడించారు. దాదాపు కిలోమీటర్ దూరం వెంబడించిన ఘరానా దొంగలు వద్దుని ఇంటిముందు బైక్ పడిపోతున్నట్లుగా నటించి బాబాయ్ బండి పడిపోతుంది లేపమని కేకలు వేయశారు. సహాయం చేయడానికి వెళ్లిన వృద్ధుని జేబులో నుంచి అతనికి తెలియకుండా ఖరీదైన స్మార్ట్ ఫోన్ దొంగిలించి పరారయ్యారు. ఈ సంఘటన జరిగిన వెనువెంటనే దాదాపు అర్ధగంట సమయంలోనే చల్లపల్లి పోలీస్ స్టేషన్ పక్కనే వైశ్య బజార్లో గల మండపం పక్కన 64 సంవత్సరాలు గల మరొక వద్దుని వద్ద పై తరహాలోనే పడిపోతున్నట్లుగా నటించి వృద్ధుని జేబులో నుంచి ఖరీదైన స్మార్ట్ ఫోన్ దొంగిలించి పరారయ్యారు. రెండు దొంగతనాల బాధితులు పోలీసులను ఆశ్రయించగా దగ్గర్లోని సిసి టీవీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు బైక్ పై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తుల కోసం చల్లపల్లి చుట్టుపక్కల పరిసర ప్రాంతాలలో గాలింపు చర్యలు చేస్తున్నారు.

వెండి కిరీటం బహూకరణ

ప్రజాశక్తి-పెదపారుపూడి: శ్రీబుష్ణ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రమైన పెదపారుపూడి చెరువుగట్టు సెంటర్లో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక సుప్రియ కన్స్ట్రక్షనరీ కంపెనీ అధినేత ఎండూరి రవికుమార్ దంపతులు సుమారు 60 వేల రూపాయలు విలువ గల వెండి కిరీటాన్ని శనివారం అందజేశారు. అనంతరం శివార్చకులు లక్ష్మీ నరసింహాచార్యులు, రమేష్ సుబ్రహ్మణ్యేశ్వరశర్మ పూజలు నిర్వహించారు.



రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కృష్ణ గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సూచించారు. డా.బిఆర్ అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం మచిలీపట్నంలోని ఈశ్వర్ రెసిడెన్సీలో 'ప్రమాదంలో రాజ్యాంగం-నేటి కర్తవ్యం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రాజేష్ అధ్యక్షతన జరిగిన సదస్సులో లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ పదేళ్ల కాలంలో రాజ్యాంగ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

మౌలిక స్వరూపాన్ని దెబ్బతీసే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ చర్యలు ఉన్నాయని అవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం, ఫెడరలిజం, లౌకికవాదం, సామాజిక న్యాయం, పూర్తిగా ధ్వంసం కాబడుతున్నయన్నారు. అలాగే రాజ్యాంగం లోని మౌలిక సదుపాయాలను దెబ్బతీయాలని చూస్తున్నరన్నారు. లౌకికవాదాన్ని దెబ్బతీసే విధంగా మతపరమైన రాజ్యాంగాన్ని తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రాంతీయ పార్టీలను మింగేసేలా బిజెపి వ్యవహార శైలి ఉందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ అనుసరిస్తున్న రాజ్యాంగ ఉల్లంఘనలను ప్రజలందరూ ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు కొడాలి శర్మ, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి జి కిషోర్‌కుమార్, ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ నాయకులు ఆర్ వెంకటరావు, సిఐటియు జిల్లా నాయకులు బూర సుబ్రహ్మణ్యం, కెవిపిఎస్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మిరియాల ఆనంద్ బెనర్జీ, పెటేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

కొండాలమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని శనివారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ రాజమహేంద్రవరం, మేడేపల్లి విజయరాజు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి దేవస్థాన ఆఫీసు నందు దేవాలయం యొక్క రికార్డులను పరిశీలించి తగు సూచనలు సలహాలను చేశారు.

రామకృష్ణకు ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం

ప్రజాశక్తి-చల్లపల్లి: చల్లపల్లి జూనియర్ టెలికాం ఆఫీసర్ డి.రామకృష్ణకు ఉమ్మడి కృష్ణాజిల్లాలో 2023-24 సంవత్సరానికి కొత్తగా బిఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ కనెక్షన్ లు అత్యధికంగా చేసినందుకు పవర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ అవార్డు అందుకున్నారు. స్థానిక బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో శనివారం బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ వై.రవీంద్రనాథ్ రామకృష్ణకు అవార్డు ప్రదానం చేశారు. గత 4 సంవత్సరాలుగా ఫైబర్ నెట్ కనెక్షన్స్ ఇస్తూ... ఇంటర్ నెట్ అంతరాయం లేకుండా సేవలు అందిస్తున్న రామకృష్ణకు అభినందనలు తెలిపారు.

విద్యార్థినులకు అభినందన

ప్రజాశక్తి-గన్నవరం: వీరపనేనిగూడెంలోని ప్రభుత్వ గురుకుల కాలేజీలో బైపిసిలో అత్యధిక మార్కులు సాధించిన హరిక, జాహ్నవి లను గన్నవరం మండలం జడ్పిటిసి ఎలిజబెత్ రాణి అభినందించారు. ఆమె మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా వైఎస్ఆర్ ప్రభుత్వం ప్రధానంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదలకు విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి నాణ్యమైన విద్యను అందించేందుకు తగిన చర్యలు తీసుకోవటం ద్వారా ఈ రోజున ప్రభుత్వ పాఠశాలలో కాలేజీలలో రాష్ట్రంలోనే అత్యధిక మర్కులు సాధించటమే ఉదాహరణ అని అన్నారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-గన్నవరం: స్థానిక ఎస్వీఆర్ కళ్యాణ మండపంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పలు గ్రామాల నుంచి వైసీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున టీడీపీలో చేరారు. వీరికి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో గన్నవరం నుంచి గెలిచి టిడిపి జెండా ఎగరవేస్తామన్నారు.

మహిళాభివృద్ధే టిడిపి ధ్యేయం : విశ్రమ

ప్రజాశక్తి-పెదపారుపూడి: మహిళల అభివృద్ధి టిడిపి ధ్యేయమనిటిడిపి, బిజెపి, జనసేన పార్టీల పామర్రు నియోజకవర్గ అభ్యర్థి వర్ల కుమార్ రాజా సతీమణి వర్ల విశ్రమ అన్నారు. మండలంలోని పులవర్తి గూడెంలో శనివారం ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంచుతూ రాబోయే ఎన్నికలలో ఎమ్మెల్యే గా పోటీ చేస్తున్న కుమార్ రాజాను ఆదరించి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మైనేని ఇందిర, చలసాని రమేష్ చౌదరి, కూచిపూడి జ్యోతి, నత్తావాణి, చలసాని దివ్య తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి కుమార్తె ప్రచారం

ప్రజాశక్తి-చల్లపల్లి: అవనిగడ్డ నియోజకవర్గం శాసనసభ్యులు వైఎస్ఆర్సిపి అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబు గెలుపు కొరకు తన కుమార్తె సింహాద్రి నిచ్చల, చల్లపల్లి మండలం నూకల వారి పాలెం గ్రామంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించి తన తండ్రి గెలుపుకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అఖండ మెజార్టీని చేకూర్చాలని కోరుతూ ముందుకు సాగుతున్నారు.

సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పేదల కుటుంబాల్లో అక్షర వెలుగులు నింపడం కోసమే తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమిలో సూపర్ సిక్స్ పథకాలలో తల్లికి వందనం పథకం చంద్రబాబు నాయుడు చేర్చారని శ్రీ రాం నిహార్ బాబు అన్నారు. శనివారం 38వ బూత్ లో జగ్గయ్యపేట నియోజకవర్గం తెలుగుదేశం బిజెపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి శ్రీరామ్ రాజగోపాల్ సోదరుడైన శ్రీ రామ్ సాయి కుమారుడు శ్రీరామ్ నిహార్ బాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలలో తల్లికి వందనం అద్భుతమైన పథకమని అన్నారు. ఈ కార్యక్రమం లో పెరం సైదేశ్వరరావు, సిమ్మసర్తి వెంకటేశ్వర్లు, షరీఫ్, సైదా, డి ఈశ్వర రావు, ఏ రాంబాబు, వేణిగా పండు, దీపు, జంపాల పవన్, వై అశోక్, జనసేన, బిజెపి, తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణాజిల్లా
ఆదివారం
14 ఏప్రిల్ 2024

ఎన్నికల ప్రవర్తనా నియమావళి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా)
రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులకు సంబంధించి ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. లేదంటే ఎన్నికల సంఘం తీసుకునే చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఈ నియమ నిబంధనలు పాటించాల్సిందే....

చేయకూడనివి

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే అమల్లోకి వచ్చింది.
రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఉద్యోగులు ప్రవర్తనా నియమావళి పరిధిలోకి వస్తారు.



1.మత, కుల ప్రాంత వర్గ జాతి బేధాలు వంటి సున్నితమైన అంశాలతో ప్రచారం చేయరాదు.
2.మతపరమైన ప్రార్థనామందిరాల్లో ప్రచారం చేయకూడదు.
3.ప్రజాజీవితానికి ఇబ్బంది కలిగేలా ఊరేగింపులతో వెళ్లకూడదు
4.లౌడ్ స్పీకర్లను ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరుకు మాత్రమే ఉపయోగించాలి.
5.అనుమతి ఉన్న వాహనాల్లో మాత్రమే ప్రచారం నిర్వహించాలి. అనుమతి పత్రాన్ని వాహనం విండ్ స్క్రీన్ మీద అతికించాలి. వాహనాల్లో ఐదుగురుకంటే ఎక్కువ మంది ప్రయాణించకూడదు.
6.ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచారం చేయరాదు. ప్రభుత్వ మైదానాల్లో అనుమతి లేకుండా ప్రచారం చేయకూడదు.
7.రిటర్నింగ్ అధికారి కార్యాలయాలనికి 100 మీటర్లు లోపు వరకు మాత్రమే వాహనాలు అనుమతి ఉంటుంది.
8.నామినేషన్ వేయుటకు ఆర్వో కార్యాలయానికి ఐదుగురిని మాత్రమే అనుమతిస్తారు.
9. ప్రైవేటు భవనాలపైనా, మైదానాలలో ప్రచారం నిర్వహించడానికి, ఇంటి, స్థల యజమాని, ఆర్వో అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.
10.అభ్యర్థి ప్రచారానికి టోపీలు, మాస్కులు వైగారా ఇవ్వవచ్చు. కానీ చీరలు, దోవతులు, టివిలు, సెల్‌ఫోన్ వంటివి పంచరాదు. చీరలు, దోవతులు పంచితే లంచం కింద పరిగణిస్తారు.
11. ప్రచారంలో మద్యం తయారీ, పంపిణీ నిషేధం, పోలింగ్ ముగింపునకు 48 గంటల ముందుగా మద్యం దుకాణాలు మూసి వేయాలి.
12.పోలింగ్ ముగింపుకు ముందుగా ఒక గంట నుండి 48 గంటలు ముందుగా అన్ని రకాల ప్రచారాలు ఆపివేయాలి.
13. సభలు, సమావేశాలు, ర్యాలీలు, పోలీస్, ఆర్ఒ అనుమతితోనే ఏర్పాటు చేసుకోవాలి.
14.పోలింగ్ రోజున ఓటర్లకు ఎలాంటి వాహనాలు ఉపయోగించకూడదు.
15. ఎన్నికల ఫలితాలపై సర్వేలు, ఎగ్జిట్ పోల్స్ నిషేధం.
16. పోలింగ్ స్టేషన్‌లోకి అభ్యర్థికి , ఎలక్షన్ ఏజెంటుకు, పోలింగ్ ఏజెంట్‌కు మాత్రమే అనుమతి ఉంటుంది. అయితే క్రమశిక్షణ లేకుండా ప్రవర్తించరాదు.
17.ఓటు కోసం లంచం ఇవ్వడం, ప్రలోభపెట్టడం, భయపెట్టడం చేయకూడదు.
18.ఎన్నికల వ్యయం ఇసిఐ నిర్ణయించిన మొత్తం కన్నా ఎక్కువ ఖర్చు చేయకూడదు.
19. ప్రభుత్వ సేవలను బలవంతంగా పొందకూడదు.
20. పోలింగ్ స్టేషన్‌లోకి అక్రమంగా ప్రవేశించడం ఇవిఎం, ఇతర రికార్డు తొలగించడం చేయకూడదు.
21. పోలింగ్ స్టేషన్‌లోకి ప్రవేశించి ఆక్రమించుకోవడం నేరం.
22. ప్రభుత్వ అధికారుల సేవలను బలవంతంగా పొందరాదు.
23.ఎన్నికల ప్రచారంలో ప్రజల మధ్య శతృత్వం పెరిగేలా చేయకూడదు.
24.కరపత్రాలు, పోస్టర్‌లు, మొదలైన వాటిపై నియంత్రణ తప్పనిసరిగా ఉండాలి.
25. రహస్య ఓటింగ్ పద్ధతికి భంగం కలిగించరాదు.
26. ఎన్నికలకు సంబంధించి తప్పు ప్రకటనలు ఇవ్వకూడదు.
27. సభలు, సమావేశాలు, నిషేధిత ప్రాంతాల్లో పెట్టకూడదు. ర్యాలీలు, ట్రాఫిక్‌కు ఇబ్బంది కరంగా లేకుండా నిర్వహించుకోవాలి. ప్రభుత్వ బంగళాలు, గెస్ట్ హౌస్‌లు, ప్రచారాలకు ఉపయోగించ రాదు.
28. పెయిడ్ న్యూస్‌లకు అనుమతి లేదు.
29.మోడల్ కోడ్ అమల్లో ఉన్నప్పుడు తాత్కాలిక, శాశ్వత ఉద్యోగ నియామకాలు చేయకూడదు.
30.మంచి ప్రవర్తన కలవారిని కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకోవాలి.
31.పోలింగ్ రోజున, కౌంటింగ్ రోజున రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్లు, పోలింగ్ ఏజెంట్లు పోలింగ్ సిబ్బందికి సహకరించాలి.

చేయదగినవి

1.ఇసిఐ అనుమతితో కరువు నివారణ పనులు చేపట్టవచ్చు.
2.కరువు ప్రాంతాల్లో ఆహారం, గడ్డి సరఫరా చేయవచ్చు.
3. కోర్టు అనుమతి ఉన్న ఉద్యోగ నియామకాలు చేయవచ్చు.
4. ఇసిఐ అనుమతితో మంచినీటి సరఫరా చేయవచ్చు.
5.ప్రజాప్రతినిధులు తమ వాహనాలను ఇంటి నుండి ఆఫీసు వరకు, ఆఫీసు నుండి ఇంటి వరకు మాత్రమే ఉపయోగించాలి.
6.ఇసిఐ అనుమతితో కవి సమ్మేళనాలు, ముసాయిదాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించవచ్చు.
7.ఇండిపెండెంట్ డే, రిపబ్లిక్ డే, మేడే, ప్రముఖుల పుట్టిన రోజు కార్యక్రమాలను చేయవచ్చు. అయితే ఈ కార్యక్రమాల్లో రాజకీయ ప్రసంగాలు ఉండకూడదు.
8.ఖైదీల విడుదల , గిట్టు బాటు ధరల నిర్ణయం వంటివి ఈసిఐ అనుమతితోనే చేయాలి. మోడల్ కోడ్ అమలుకు ముందుగా ఉన్న ప్రభుత్వ కార్యక్రమాలను కొనసాగించవచ్చు.
9.పబ్లిక్ మైదానాలను , సభలకు, సమావేశాలకు ప్రభుత్వ అనుమతితో ఉపయోగించుకోవచ్చు. మొదటి దరఖాస్తు చేసుకున్న వారు మొదటి అవకాశం లభిస్తుంది. ఇందుకు పోలీస్, ఆర్వో అనుమతి తీసుకోవాలి.
10.ప్రత్యర్థి పార్టీ విధి విధానాలను విమర్శించుకోవచ్చు.
11.శాంతియుతమైన ప్రజా జీవితానికి భంగం కలగ కుండా ప్రచారం చేసుకోవచ్చు.

ఇవిఎంలకు పటిష్ట భద్రత



ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన 306 పోలింగ్ బూత్ లకు సంబందించిన ఈవియంలను శనివారం సాయంత్రం గన్నవరం జిల్లాపరిషత్ హైస్కూల్‌లో కేటాయించిన స్ట్రాంగ్ రూమ్ కు రెండు ఆర్.టి.సి ప్రభుత్వ వాహనాల్లో పటిష్ట బందోబస్తు మధ్య తీసుకువచ్చారు. గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిణి, జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా వాహనాల సీల్ ను ఓపెన్ చేసి రెండు 37 పెట్టెల్లో తీసుకువచ్చిన 267 బ్యాలెట్ యూనిట్లు, 267 కంట్రోల్ యూనిట్లు, 297 వి.వి.పి.ఎ.టి లను స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరిచారు. ఈ సందర్భంగా గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిణి, జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ మచిలీపట్నం నుంచి తీసుకువచ్చిన మొత్తం ఈ.వి.యం లను వి.వి.పి.ఎ.టి లను స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరిచామని నామినేషన్ ప్రక్రియ ఉపసంహరణలు పూర్తయ్యాక ఏ పోలింగ్ స్టేషన్ కు ఏ ఈ.వి.యం ను కేటాయించింది 2వ రేండమైజేషన్ ద్వారా పారదర్శకంగా రాజకీయ పార్టీల ప్రతినిధులకు నిర్ణీత సమయంలో తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ గన్నవరం తహశీల్దారు యన్.యస్ పవన్ కుమార్, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దారు ఎ యస్ ఆర్ గోపాలరెడ్డి, డిప్యూటీ తహశీల్దారు కె.వి రమణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



హ్యాట్రిక్ సాధించేనా?

- చేరువలో కొందరు నేతలు
- మూడోసారి సీటు దక్కని మరికొందరు

ప్రజాశక్తి-కృష్ణా ప్రతినిధి
రాజకీయాల్లో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా మూడు సార్లు గెలుపొందడం సాధారణ విషయం కాదు. కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల నుంచి ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న నేతల్లో ఒక్కరు మాత్రమే ఇప్పటి వరకు మూడుసార్లు వరుస విజయాలు సాధించారు. వరుసగా రెండుసార్లు విజయం సాధించిన ముగ్గురు నేతలు ఈ ఎన్నికల బరిలో నిలిచారు. వీరిలో ఎందరు హ్యాట్రిక్ సాధిస్తారనేది చర్చనీయాంశమైంది.

విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో కెఎల్ రావు మాత్రమే 1962-1971 మధ్య జరిగిన ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. ఆ తర్వాత 1996, 98 ఎన్నికల్లో ఉపేంద్ర, 2004, 2009 ఎన్నికల్లో లగడపాటి రాజగోపాల్ సైతం కాంగ్రెస్ పార్టీ నుంచి వరుస విజయాలు సాధించారు. అయితే మూడోసారి విజయాన్ని నమోదు చేయలేకపోయారు. తాజాగా ఈ నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా బరిలో ఉన్న కేశినేని శ్రీనివాస్(నాని) 2014, 2019 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని అత్యధిక స్థానాలు వైసిపి గెలుపొందినప్పటికీ అత్యధిక సంఖ్యలో క్రాస్ ఓటింగ్ జరగడంతో కేశినేని విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో అధికార వైసిపి నుండి పోటీ చేస్తున్న కేశినేని నాని హాట్రిక్ సాధించి కెఎల్ రావు సరసన చేరతారోలేదో చూడాలి.

ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాలకు సంబంధించి.... గుడివాడ ఎంఎల్‌ఎ కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని) అక్కడి నుండే వరుసగా నాలుగు పర్యాయాలు విజయం సాధించారు. 2004, 2009 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా, 2014, 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. తాజాగా ఇదే నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. మరి ఆయన మరోసారి గెలుపొంది డబుల్ హాట్రిక్ సాధిస్తారోలేదో చూడాలి. గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2014, 2019 ఎన్నికల్లో వల్లభనేని వంశీమోహన్ టిడిపి నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఈసారి ఎన్నికల్లో ఆయన వైసిపి అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. విజయవాడ తూర్పు ఎంఎల్‌ఎ గద్దె రామమోహనరావు టిడిపి నుంచి గెలుపొందారు. వచ్చే ఎన్నికల్లోనూ టిడిపి అభ్యర్థిగా తూర్పు నియోజకవర్గం నుంచే ఆయన బరిలోకి దిగుతున్నారు.

రక్షణనిధికి సీటు గల్లంతు
తిరువూరు నియోజకవర్గం నుండి వైసిపి అభ్యర్థిగా కె.రక్షణనిధి 2014, 2019 ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. పార్టీ నిర్వహించిన సర్వేల్లో వ్యతిరేకత ఉండటంతో ఈ ఎన్నికల్లో వైసిపి అధిష్టానం ఆయనకు టికెట్‌ను నిరాకరించింది. వరుసగా రెండు సార్లు గెలుపొందిన ఆయన మూడోసారి పోటీ చేయలేకపోయారు. దీంతో ఆయన హ్యాట్రిక్ రేసులో లేకుండా పోయారు.



బిజెపి మళ్లీ వస్తే రాజ్యాంగాన్ని మార్చడం ఖాయం

ఇండియా వేదిక సమావేశంలో నేతలు

ప్రజాశక్తి-గన్నవరం
నీతి వంతమైన రాజకీయాల కోసం కాంగ్రెస్, సిపిఐ మద్దతుతో ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరావు గెలుపునకు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. సిపిఐ కార్యాలయంలో శనివారం మూడు పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయన్నారు. దేశ సంపద కార్పొరేట్ శక్తుల పరం అవుతుందన్నారు. మళ్లీ బిజెపి అధికారంలోకి వస్తే రాజ్యాంగం మార్చేయడం ఖాయమన్నారు. అదే జరిగితే మైనార్టీలకు, లౌకికవాదులకు, ప్రజాస్వామ్య పార్టీలకు ప్రమాదం వాటిల్లుతుందన్నారు. ఎన్డీఏ కూటమి, వైసిపిల ఓటమే లక్ష్యంగా పని చేయాలన్నారు. గన్నవరం సిపిఎం అభ్యర్థి వెంకటేశ్వరరావు నియోజకవర్గంలో రైతుల పక్షాన పోరాటం చేసి జైలుకు వెళ్లారన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వింతా సంజీవరెడ్డి మాట్లాడుతూనీతివంతమైన రాజకీయాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం వచ్చిందన్నారు. బిజెపి స్వార్ధ రాజకీయంతో ప్రత్యర్థి పార్టీల అకౌంట్లను సీజ్ చేస్తున్నారని అన్నారు. ఎన్నికల బాండ్ల పేరుతో లక్షల కోట్లు బిజెపి ఖాతాలోకి చేరినా వారి ఖాతాలు ఎక్కడా సీజ్ చేసిన పరిస్థితి లేదన్నారు. బిజెపిని ఓడించి ఇండియా కూటమిని అధికారంలోకి తేవాల్సిన అవసరం ఉందన్నారు. గన్నవరం నియోజకవర్గంలో సిపిఎం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు గెలుపు కోసం పాటుపడటంతో పాటు మచిలీపట్నం పార్లమెంట్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. సిపిఐ జిల్లా నాయకులు పెద్ది వెంకటరత్నం మాట్లాడుతూ మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య మూడుసార్లు ఇక్కడ ఎమ్మెల్యేగా పని చేశారని, ఆయన వారసుడుగా పోటీలో ఉన్న వెంకటేశ్వరరావుకు ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలన్నారు. అనంతరం మూడు పార్టీల నాయకులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ నెల 23వ తేదీన కళ్లం వెంకటేశ్వరరావు నామినేషన్ వేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు, వామపక్ష నాయకులు ఎం.హరిబాబు, టి.వి.లక్ష్మణస్వామి, మల్లంపల్లి ఆంజనేయులు, అనుమోలు వెంకటేశ్వరరావు, మీరా ఖాన్, పెద్ది వాసుదేవరావు, కాట్రగడ్డ రామచంద్ర జోషి, శనగల సుబ్బారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కె.గణేష్‌బాబు, గోవిందు నాగబాబు తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఇండియా వేదిక నాయకులు

గుణదల వంతెన బ్రిడ్జి నిర్మించని వారికి బుద్ధి చెప్పండి

సిపిఎం సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి బాబూరావు

ప్రజాశక్తి-విజయవాడ: 15 సంవత్సరాలుగా గుణదల ఫ్లైఓవర్ బ్రిడ్జి పూర్తి చేయడం చేతగాని వైసీపీ, టిడిపి, బిజెపిలకు ఓటుతో బుద్ధి చెప్పాలని సిపిఎం సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి సిహెచ్.బాబూరావు పిలుపునిచ్చారు. శనివారం గుణదల ఆదర్శ కాలనీ, షిరిడి సాయి నగర్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిడ్జి మొండిగోడల వద్ద ఆందోళన నిర్వహించారు. ఫ్లైఓవర్ నిర్మాణం కోసం జరిగే ఉద్యమంలో ప్రజలు కలిసి రావాలని కోరారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ 2009వ సంవత్సరం ఫిబ్రవరి 19వ తేదీన గుణదల ఫ్లైఓవర్ బ్రిడ్జికి శిలాఫలకం వేసి నేటికీ పూర్తి చేయకపోవడం వైసిపి, టిడిపి ప్రభుత్వాల అసమర్థతకు నిదర్శనమన్నారు. కాలవ కట్టల వాసులకు పట్టాలిస్తామని చెప్పి మోసం చేశారన్నారు. బ్రిడ్జి లేకపోవడంతో ట్రాఫిక్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గంటల తరబడి సమయం వృథా అవుతుందన్నారు. మధురానగర్ అండర్ బ్రిడ్జి ఏడేళ్లుగా సాగుతూనే ఉందని, వాంబేకాలనీ అండర్ బ్రిడ్జి ఊసే లేదని, సింగ్‌నగర్ రెండో ఫ్లైఓవర్ మాట ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రిడ్జి నిర్మాణానికి, కాల్వకట్ట వాసుల పట్టాల కోసం ఇండియా వేదిక బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు బి రమణరావు, కళ్యాణ్, శ్రీనివాస్, గోవిందు, షకీలా, అజయ్, కృష్ణ, చిన్నా, కష్టమూర్తి, సుప్రజ, ప్రవీణ్ పాల్గొన్నారు.



బ్రిడ్జి వద్ద ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

ఈవీఎంల పంపిణీలో అప్రమత్తం

కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)
తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియలో వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలకు కేటాయించబడిన ఈవీఎంలు, వివి ప్యాట్‌ల పంపిణీ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శనివారం కలెక్టరేట్లోని ఈవీఎం గోడౌన్ వద్ద పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం మేనేజ్మెంట్ సిస్టం ద్వారా ఆన్లైన్లో తొలి విడత ర్యాండమైజేషన్ డేటా ఆధారంగా వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలకు కేటాయించిన ఈవీఎంలను ఆయా నియోజకవర్గాలకు డిస్పాచ్ అయ్యేవిధంగా చూడాలని ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఈ ప్రక్రియ కట్టుదిట్టంగా జరగాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆయా నియోజకవర్గాలకు కేటాయించబడిన నెంబర్లు గల ఈవీఎంలను, వివి ప్యాట్ లను స్కానింగ్ చేసి తగిన భద్రతతో ఆయా నియోజకవర్గాలకు తీసుకువెళ్లవలసి ఉంటుందని సిబ్బందికి కలెక్టర్ సూచించారు. ఈ ప్రక్రియలో ఒక నియోజకవర్గానికి వెళ్లవలసిన ఈవీఎం మరో నియోజకవర్గానికి వెళ్లకుండా, ఎలాంటి పొరపాట్లు జరగకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. ఇక్కడి నుంచి కట్టుదిట్టమైన భద్రత మధ్య ఆయా నియోజకవర్గాలకు ఈవీఎంలు ఆయా నియోజకవర్గాలకు తీసుకువెళ్లాలని రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్ఓ కె. చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలి
ఎన్నికల విధులు కేటాయించబడిన సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించు కోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. జిల్లా కలెక్టర్ శనివారం కలెక్టరేట్లో తమ చాంబర్లో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధులు కేటాయించబడిన వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి, అత్యవసర సేవల క్రింద గుర్తించబడిన వివిధ ప్రభుత్వ శాఖలు వారి సిబ్బందికి ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకునే వారు ఫారం- 12, ఫారం-12 డి ద్వారా ఈనెల 16వ తేదీలోగా ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో దరఖాస్తు దాఖలు చేయవలసి ఉంటుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే వారికి మే 2వ తేదీ నుండి 10వ తేదీ వరకు ఆయా నియోజకవర్గాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

బస్సు యాత్రకు ఘన స్వాగతం

కనకదుర్గ వారథి మీదుగా శనివారం సిఎం బస్సు యాత్ర విజయవాడ నగరంలోకి ప్రవేశించింది. ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పూల వర్షం కురిపించారు. భారీ క్రేన్ల సాయంతో గజమాలలను వేశారు. బస్సు యాత్ర వాటర్ ట్యాంక్ రోడ్, శిఖామణి సెంటరు, చుట్టుగుంట, బిఆర్‌టిఎస్ రోడ్, భగత్‌సింగ్ రోడ్డు, సింగ్‌నగర్, కండ్రిక మీదుగా రామవరప్పాడు రింగ్ వద్ద జాతీయ రహదారిపైకి చేరుకుంది. విజయవాడ నగరంలో సుమారు మూడున్నర గంటలకుపైగా యాత్ర సాగింది. అనంతరం రామవరప్పాడు, ప్రసాదంపాడు, నిడమానూరు మీదుగా గన్నవరం మండలం కేసరపల్లి వద్ద కృష్ణా జిల్లాలోకి ప్రవేశించింది. అక్కడ బైపాస్ శివారులో ఏర్పాటు చేసిన రాత్రి బస శిబిరం వద్దకు యాత్ర చేరుకుంది. విజయవాడ ఎంపి కేశినేని నాని, పలువురు ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు పాల్గొన్నారు.




ప్రజలకు జగన్ అభివాదం


జగన్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న వైసిపి శ్రేణులు


కనకదుర్గ వారధిపై సాగుతున్న బస్సుయాత్ర





రోడ్లపై మురుగు నిల్వ



ప్రజాశక్తి - వీరులపాడు : మండలంలో పలు గ్రామాల్లో పంచాయతీ అంతర్గత రోడ్లు మురుగు తీయక పోవటం వల్ల నిల్వ ఉండి దుర్వాసనతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఎన్నికల విధుల్లో ఉండటం గ్రామపంచాయతీలో అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని ప్రజలు అంటున్నారు. ఏ అధికారిని అడిగినా ఎన్నికల డ్యూటీలో ఉన్నామని సమస్యలు పట్టించుకోవట్లేదని ప్రజలు వాపోతున్నారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మైలవరం : మండలంలోని వెల్వడం గ్రామానికి చెందిన సోడా గుడి ప్రసన్నకుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సిపి నాయకులు యర్రమల రాంభూపాల్ రెడ్డి శనివారం ప్రసన్న కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ధర్మరాజు, వైస్ ఎంపీపీ రత్నబాబు, వార్డ్ మెంబర్ గరికపాటి రవి, నాయకులు నంది పాము నాగేశ్వరరావు, ఎలమర్తి స్వామి పాల్గొన్నారు.

దేవస్థానం మాజీ చైర్మన్ గంటా మృతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: తిరుమలగిరి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ గంటా హనుమంతరావు శనివారం విజయవాడ హాస్పటల్‌లో మృతిచెందారు. మతదేహాన్ని జగ్గయ్యపేట డివిఆర్ నగర్‌లోని వారి స్వగృహానికి తరలించారు. విషయం తెలుసుకొన్న ప్రభుత్వ విప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను సందర్శించి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మైలవరం : ద్విచక్ర వాహనంపై రహదారి దాటుతున్న క్రమంలో కారు ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామం వద్ద చోటుచేసుకుంది. వివరాల ప్రకారం చెవుటూరు గ్రామానికి చెందిన ముత్యాల సుబ్బారావు, తాటి వెంకటేశ్వర్లు తమ ద్విచక్ర వాహనంపై గ్రామ శివారులో బైపాస్ రోడ్డు కానుకొని ఉన్న రెస్టారెంట్‌కు వెళ్నారు. బైపాస్ రహదారిదాటుతున్న క్రమంలో విజయవాడ వైపు నుంచి మైలవరం వైపు వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో ముత్యాల సుబ్బారావు కుడికాలు పాదం, తాటి వెంకటేశ్వర్లు (50) కుడికాలు మోకాలు కింది భాగం పూర్తిగా నుజ్జు నుజ్జు అయింది. క్షతగాత్రులను 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న తాటి వెంకటేశ్వర్లు మరణించినట్లు బంధువులు తెలిపారు. వెంకటేశ్వర్లు భార్య కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. వెంకటేశ్వర్లు తాపీ పని చేస్తూ ఉన్నాడు. ఇతనికి ఒక కుమారుడు కలరు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జి.కొండూరు పోలీసులు తెలిపారు.



కాంగ్రెస్‌ను ఆదరించండి : తాంతియా

ప్రజాశక్తి - విస్సన్నపేట : అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలను అందించే కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటర్లు ఆదరం చాలని తిరువూరు నియోజక వర్గ కాంగ్రెస్ అభ్యర్థి తాంతియా కుమారి కోరారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. దళిత గిరిజన బడుగు బలహీన వర్గాల వారికి ఆశాజ్యోతిగా తమ తండ్రి కోనేరు రంగారావు డిప్యూటీ ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్‌లో సేవలందించారని, తిరువూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ఆయన చేశారని అప్పటినుండి కూడా తిరువూరు నియోజకవర్గ అభివృద్ధి మెరుగుపడిన దాఖలు లేవని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు గోళ్ళ వెంకట గురునాధరావు, మండల పార్టీ అధ్యక్షుడు గుడ్డల రాంబాబు మండల ప్రధాన కార్యదర్శి పరస శాతభూషణం సిపిఎం నాయకులు విసంపల్లి నాగరాజు మేకల జ్ఞాన రత్నం పులిబళ్ళ ఏడుకొండలు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం

ప్రజాశక్తి - మైలవరం : మైలవరం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తిరువూరు రోడ్డులో లయన్స్ సామాజిక భవనాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మైలవరం లయన్స్ క్లబ్ అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త పాలకమండలి చైర్మన్ ఎస్.వి.సుధాకర్‌రావు, ద్వారకాతిరుమల దేవస్థానం పాలకమండలి సభ్యులు ఎస్విఎస్ నివత రావు సహకారంతో ఈ సామాజిక భవనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మైలవరం పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో ఇంటిలో వీలు లేక ఎక్కువ మంది ప్రజలు తమ కుటుంబాల్లో కార్యక్రమాలు చేసుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ఈ సామాజిక భవనాన్ని నిర్మించామన్నారు. ఈ భవనంలో భోజనశాల, వంటగది తదితర అవసరమైన మౌలిక సౌకర్యాలను కల్పించామని, ఈ అవకాశాన్ని గ్రామస్తులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో



చాంబర్ ఆఫ్ కామర్స్ మైలవరం అధ్యక్షులు చలవాది మధుసూదన్‌రావు, వైకుంఠధామం, సామాజిక భవనం ఇన్‌ఛార్జి వి.బాలాజీ ప్రసాద్, భావన రుషి కళ్యాణమండపం అధ్యక్షులు గణపవరపు విష్ణువర్ధనరావు, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ మైలవరం అధ్యక్షులు జడ్ నాగిరెడ్డి, మైలవరం లయన్స్ క్లబ్ సెక్రటరీ చలవాది హరీష్ కుమార్ గుప్తా, ట్రెజరర్ తిమ్మన దినేష్ బాబు, లయన్స్ సభ్యులు లేళ్ళ ఏడుకొండలు, స్థానికులు పాల్గొన్నారు.

ఆదరణ గృహం ప్రారంభం

ప్రజాశక్తి - విస్సన్నపేట : స్థానిక ఇందిరానగర్‌లో అనాథలకు వృద్ధులకు వికలాంగులకు ఒంటరివారికి అన్ని వసతులతో కూడిన ఆదరణ గృహంను ఎలిసెల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు చిన్న వయసు నుండి ఎంతోమందిని ఎవరూ లేనివారిని అనాథలను కుటుంబం ఉండి కూడా పట్టించుకోని వారు పడే బాధలను ఇబ్బందులను చూసి పెరిగానని అన్నారు. తమది మధ్యతరగతి కుటుంబం అని అన్ని కష్టాలు చూశామని అన్నారు. అలాంటి ఇబ్బందులు పడేవారికి నీడగా ఉండాలని ఆదరణ గృహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భోజనం,



నివాసం వసతులన్నీ ఉన్నాయన్నారు.

కూటమి అభ్యర్థి శ్రీరాం తాతయ్య సమావేశం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగన్మోహన్‌రెడ్డి నాసిరకం మద్యంతో 35 లక్షల మంది అనారోగ్యం పాలయ్యారని, 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారని జగ్గయ్యపేట ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ అన్నారు. పట్టణంలోని రాజగోపాల్ స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు దశల్లో మద్యాన్ని నిషేధిస్తామన్నారు. మద్యాన్ని 5 స్టార్ హోటల్స్‌కి మాత్రమే పరిమితం చేస్తాం అన్నారు. గంజాయి అక్రమ రవాణాలో ఏపీ మొదటి స్థానంలో ఉందని, ఏపీలో దొరికినంత గంజాయి దేశంలో మరే ఇతర రాష్ట్రంలో దొరకలేదని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో నివేదిక 2021 వెల్లడించింది అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కో కన్వీనర్ ముల్లంగి రామకృష్ణారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్



చైర్మన్ నూకల కుమార్ రాజా, పట్టణ తెలుగుదేశం అధ్యక్షులు మేక వెంకటేశ్వర్లు, పట్టణ టిడిపి సెక్రటరీ మైనేని రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా సంత కాల్వ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు గ్రామంలో ప్రతి శనివారం జరిగే జీవాలు సంతలో మండల పరిషత్ కార్యాలయం పక్కన ప్రహరీ మీద నుండి జీవాలకు రశీదు తీసుకోకుండా వెళ్తున్నారనే నెపంతో పెద్ద కాలువను మార్కెట్ కమిటీ పాలక మండలి సభ్యులు, అధికారులు తవ్వించారు. ఆ గోతిలో మూగ జీవాలు పొరపాటున పడి ఏదైనా జరిగితే బాధ్యులు ఎవ్వరని జీవాల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ తీసిన చోట పైపులున్నాయని, అవి కూడా దెబ్బతిన్నాయని, వర్షం నీరు ఆగి గోడ కూడా పడిపోయే ప్రమాదం ఉంది. అక్కడ ఉన్న గోడకు ఉపాధిహామీ పథకం వారు గ్రామాలలో చేసిన పనుల గుర్తింపు కోసం శిలాఫలకాలు



పక్కన ఉంచగా ఆ కాలువలో శిలాఫలకాలు పడిపోయే ప్రమాదం ఉంది. మార్కెట్ యార్డ్ అధికారులు పరిశీలన చేసి తగిన చర్యలు చేపట్టాలని జీవాల యజమానులు కోరుతున్నారు.

నేడు బంజారాల సదస్సు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : సిఎం జగన్ సంక్షేమ పాలనలో ఎస్టీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి కృషి చేశారని జగ్గయ్యపేట నియోజకవర్గ బంజారా (లంబాడి) సోదరులు అన్నారు. పట్టణంలోని జగ్గయ్యపేట నియోజకవర్గ వైసిపి కార్యాలయం ఆదివారం జగ్గయ్యపేట పట్టణంలో బి కన్వెన్షన్‌లో ఉదయం 10 గంటలకు బంజారాల (లంబాడి) సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సిఎం జగన్ దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎస్సి, ఎస్టీ, బీసీ మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ వారి సంక్షేమానికై 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వారికి ప్రత్యేక గుర్తింపు ఇచ్చారు. బంజారాల (లంబాడి)లకు ఇంత అత్యధిక ప్రాధాన్యిస్తున్న జగన్,సామినేనికి కృతజ్ఞతగా సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని, నియోజకవర్గ వ్యాప్తంగా బంజారా సోదరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

తేజస్వికి డాక్టరేట్

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు శ్రీ వాహిని ఇంజ నీరింగ్ కళాశాలలో గత 10 సంవత్సరాలుగా సహ ఆచార్యునిగా ఇఇఇ డిపార్ట్ మెంట్‌లో పనిచేస్తున్న జి.తేజస్వికి డాక్టరేట్ లభించింది. పరిశోధనా వ్యాసం పర్ఫామెన్స్ ఎనాలసిస్ ఆఫ్ ఎంపీపీ టెక్నిక్స్ ఫర్ హైబ్రిడ్ రెన్యువబుల్ ఎనర్జీ సిస్టమ్స్‌ను డాక్టర్ రమేష్ కుమార్, డాక్టర్ రవి కుమార్ పర్యవేక్షణలో తేజస్వి సమర్పించడంతో తమిళనాడులోని ప్రభుత్వ అన్నామలై విశ్వవిద్యాలయం పిహెచ్.డి ప్రదానం చేశారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో శనివారం ఆయనను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు సన్మానించారు.



శ్రీరాం కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని రాజగోపాల్ స్వగృహంలో టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గ టిడిపి, బిజెపి, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తల్లి శ్రీమతి శ్రీరాం సక్కుబాయి గత ఆరు రోజుల క్రితం పరమపదించారు. విషయం తెలుసుకుని శనివారం పట్టణంలో శ్రీరాం తాతయ్య నివాసానికి విజయవాడ వెస్ట్ తెలుగుదేశం పార్టీ నాయకులు ఎం ఎస్ బేగ్ విచ్చేసి సక్కుబాయి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీరాం తాతయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిసానుభూతి తెలిపారు.



విరాళమిస్తున్న దాతలు

అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడ మొగల్‌రాజపురానికి చెందిన ఎస్.బాలకృష్ణ రూ.లక్ష విజయవాడ నగరానికి చెందిన క్రాంతి కిరణ్ రూ.5,1116లు, పోరంకికి చెందిన దైవాల.రామ్ కుమార్, పద్మావతి దంపతులు వృద్ధులు వికలాంగులు సహాయార్థం ఒక వీల్ చైర్, గుంటూరు నగరం బొమ్మల సెంటర్‌కు చెందిన యాత్రికుడు 290.000 గ్రాముల వెండి శఠగోపం, ఉద్ధరిణి శనివారం ఆలయ ఉప కార్యనిర్వహణాధికారి తిరుమలరావుకు అందజేశారు. అనంతరం దాతలకు అమ్మవారి స్వామివారి శేష వస్త్రాలు ప్రసాదాలు అందించారు.



ప్రచారంలో యువ నాయకులు

వసంత ధీమంత్ ప్రచారం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : ఎన్డీఏ కూటమి బలపరిచిన టిడిపి పార్లమెంటు అభ్యర్థి కేశినేని శివనాథ్, అసెంబ్లీ అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ తెలుగుదేశం పార్టీ యువనేత వసంత ధీమంత్ సాయి శనివారం రెడ్డిగూడెం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు బొమ్మిన కోటేశ్వరరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చాపలమడుగు కాంతారావు, టిడిపి, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కేతనకొండలో రచ్చబండ ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ గ్రామానికి చెందిన పలువురు వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. కేతనకొండ గ్రామంలో శనివారం రాత్రి రచ్చబండ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మైలవరం టిడిపి కూటమి అభ్యర్థి, స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్, వైసిపి నేతలను పార్టీలో చేర్చుకున్నారు.

ప్రమాదంలో కళాశాల అటెండర్ మృతి

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సుదీర్ఘ కాలం పాటు అటెండర్‌గా పనిచేసిన కాటేపల్లి కాంతారావు (53) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదానికి గురైన ఆయనకు మెదడులో రక్తం గడ్డకట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె వున్నారు. తిరువూరు డిగ్రీ కాలేజీలో అటెండర్‌గా పనిచేస్తూ కాంతారావు కృష్ణా జిల్లా అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీ అయ్యారు. ఉగాది సెలవు కావడంతో తిరువూరు ఇంటికొచ్చిన కాంతారావు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు.

సభా ప్రాంగణం పరిశీలన

ప్రజాశక్తి - గుడివాడ : ఈ నెల 14వ తేదీన గుడివాడలో జరగబోవు మేమంతా సిద్ధం సభా ప్రాంగణాన్ని మాజీ మంత్రి పేర్ని నాని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గుడివాడ వైఎస్‌ఆర్‌సిపి ఎన్నికల కార్యాలయంలో పేర్ని నాని విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ పర్యటన వివరాలను తెలియజేశారు. ఉదయం 9 గంటలకు రోడ్ షోగా సీఎం జగన్ గన్నవరం నుండి బయలుదేరుతారని గుడివాడ నియోజకవర్గంలోని జొన్నపాడులో మధ్యాహ్నం బ్రేక్ తీసుకుంటారు. అక్కడ నుంచి రోడ్ షోగా నాగవరప్పాడులోని మేమంతా సిద్ధం సభా వేదిక వద్దకు సాయంత్రం మూడు గంటలకు సీఎం జగన్ చేరుకుంటారన్నారు. నాగవరప్పాడులో మధ్యాహ్నం మూడు గంటలకు జరుగుతుందన్నారు. తామంతా సిద్ధం సభతో పాటుగా పుట్టగుంట నుండి జొన్నపాడు, గుడివాడ ఏలూరు రోడ్డు, నెహ్రూ చౌక్ , బస్టాండ్ , ఆటోనగర్ , బొమ్ములూరు, అంగలూరు, గుడ్లవల్లేరు, కౌతవరం, వడ్లమన్నాడు,రెడ్డిపాలెం వరకు జరిగే సీఎం జగన్ రోడ్ షోలో ప్రజానీకం,వైఎస్‌ఆర్‌సిపి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయవలసిందిగా పేర్ని నాని కోరారు.

డిజెలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - కోడూరు : బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోడూరు ఎస్ఐ పి.శిరీష శనివారం కోడూరు పోలీస్ స్టేషన్లో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉండటంతో డీజేలకు ఎటువంటి అనుమతి లేదని, మైకులు పెట్టాలన్నా పోలీసు ఉన్నత అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ అన్నారు. మద్యం సేవించి అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రుణమాఫీ ప్రకటించాలని ధర్నా

ప్రజాశక్తి - గుడివాడ : టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీనివాస సెంటర్ స్వర్ణకారుల బజారు కాంప్లెక్స్ వద్ద స్వర్ణ కారుల్లోని టిడ్కో లబ్ధి దారులు రేపు ముఖ్యమంత్రి సభలో టిడ్కో ఋణమాఫీ ప్రకటించాలని శనివారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బసవ అరుణ సహాయ కార్యదర్శి తాళాబత్తుల హరిబాబు సిపిఎం మాజీ శాఖ కార్యదర్శి పి.శాంతా చారి.సాహితీ స్రవంతి అధ్యక్షులు లంక సురేంద్ర ,కమిటీ సభ్యులు గొల్ల నారాయణరావు, రాలి అరవింద్, మండూరి ప్రసాద్, భూదాటి సుబ్బయ్య, గుడాల నాని,అనుపోజు విజయ్, మగుంద సాయి, వరదా శివరామ్, రాలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

35వ డివిజన్‌లో వైసిపి ప్రచారం



ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆసిఫ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 35వ డివిజన్ కార్పొరేటర్ బల్లాని మణెమ్మ సారధ్యంలో పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి తో శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ ఎలక్షన్ టైంలో ఢిల్లీ, హైదరాబాద్ నుండి పొలిటికల్ టూరిస్టులు వస్తారని, ఓడిపోగానే మూట, ముల్లె సర్దుకుని వెళ్ళిపోతారని తెలిపారు. వీళ్ల పశ్చిమ నియోజకవర్గ గురించి మాట్లాడే పెద్దలా అని మండి పడ్డారు. ఏ డివిజన్ లో ఏ సందు ఏ ఓటర్ ఎక్కడున్నాడో కూడా తెలియదని, వీళ్లు నియోజకవర్గ అభివృద్ధి గురించి బహిరంగ చర్చకు సిద్ధమైతే రండి అని సవాల్ విసిరారు. ప్రతి గడపకు తిరిగి సీఎం జగన్ మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను వివరించి, రాబోయే ఎన్నికలలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు "ఫ్యాన్" గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు పి.శరత్ బాబు, కార్పొరేటర్లు, ఎలకల చలపతిరావు, వైయస్సార్ ట్రేడ్ యూనియన్ జోనల్ ఇన్‌ఛార్జ్ ప్రదీప్ మాజీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ తోలేటి శ్రీకాంత్, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఎన్నికలు నిష్పక్షపాతంగా, సజావుగా నిర్వహించటంలో పోలింగ్, ప్రొసైడింగ్ అధికారుల పాత్ర కీలకమైనదని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. స్థానిక నోబుల్ కళాశాలలో శనివారం మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మీలో చాలామందికి గత ఎన్నికలలో పనిచేసిన అనుభవం ఉందన్నారు. అయితే ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ ఇస్తున్న నియమావళి క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకుని ఎన్నికల విధుల నిర్వహణ పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల విధులను సీరియస్‌గా తీసుకుని, ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరగకుండా సక్రమంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు ఇవిఎంలు వివి పేట్లకు ఎలా కనెక్ట్ చేయాలి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. మాక్ పోలింగ్ నిర్వహణలో సంపూర్ణ దృష్టి పెట్టాలని సూచించారు. ఎన్నికలు సజావుగా జరగాలంటే పోలింగ్ అధికారులు పాత్ర కీలకమైనదని అన్నారు. అవగాహన లేమితో ఏదైనా చిన్న పొరపాటు జరిగిన, వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తేవాలని కలెక్టర్ సూచించారు. తద్వారా సమస్య పరిష్కారానికి వీలవుతుందన్నారు. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బందరు ఆర్డిఒ ఎం.వాణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపునకు కృషి చేయాలి : జనసేన

ప్రజాశక్తి - అవనిగడ్డ : ఎన్నికలలో అవనిగడ్డ నియోజకవర్గంలో జనసేన పార్టీ గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ పార్టీ మచిలీపట్నం పార్లమెంటు ఎన్నికల నిర్వహణ కమిటీ కార్యదర్శి బండి రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం అవనిగడ్డ జనసేన పార్టీ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులు కార్యకర్తలకు అవగాహన కల్పించారు. మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థి ఎన్‌డిఎ కూటమి అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరి అవనిగడ్డ నియోజకవర్గం అసెంబ్లీ కూటమి అభ్యర్థిగా మండలి బుద్ధ ప్రసాద్ బరిలో ఉన్నారని వీరిద్దరి గుర్తు అయిన గాజు గ్లాసు విస్తతంగా ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని కోరారు. బూత్ స్థాయి ఏజెంట్లకు సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా మచిలీపట్నం పార్లమెంటు ఎన్నికల నిర్వహణ కమిటీ కార్యదర్శిగా నియమితులైన బండి రామకృష్ణను బుద్ధ ప్రసాద్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు అక్కల గాంధీ, బోని పార్వతి, యువ నాయకులు మండలి వెంకట్రాం అవనిగడ్డ టౌన్ పార్టీ అధ్యక్షులు రాజనాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి బూత్ కమిటీ కన్వీనర్ల సమావేశం

ప్రజాశక్తి - గూడూరు : గూడూరు మండల టిడిపి కార్యాలయంలో శనివారం క్లస్టర్ ఇన్‌ఛార్జ్ బూత్ కమిటీ కన్వీనర్స్‌తో మండల పార్టీ అధ్యక్షులు పోతన స్వామి నాయుడు సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17న బుధవారం పెడన విచ్చేస్తున్న చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ ప్రజాగళం సభను మండలం నుండి భారీ స్థాయిలో తరలివెళ్లి విజయవంతం చేయాలని తెలిపారు.

ఎస్‌సి, ఎస్‌టి కార్మికుల పట్ల వివక్ష

ప్రజాశక్తి - అవనిగడ్డ : ఏపీఎస్ఆర్టీసీలో క్రమశిక్షణ చర్యలు విషయంలో ఎస్సీ ఎస్టీ కార్మికులకు ఒక న్యాయం వేరే సామాజిక వర్గాలకు మరో న్యాయం చేసేలా ఆర్టీసీలోని కొందరు అధికారులు వివక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు ఆరోపించారు. శనివారం అవనిగడ్డలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ అధికారుల వివక్షపూరిత వైఖరి వల్ల ఎస్సీ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తమ అసోసియేషన్ దృష్టికి వచ్చిందన్నారు ఎస్సీ ఉద్యోగులపై అక్రమ కేసులు నమోదు చేయడమే కాకుండా చార్జిషీట్లను ఎస్సీ కార్మికులపై అధికారులు తమకు ఇష్టమైన రీతిలో తయారు చేయడం సాక్షులు లేకుండా సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఎస్సీ ఉద్యోగులపై విచారణ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ మధ్యకాలంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం అయిన తరువాత ఆర్టీసీ ఉద్యోగుల విషయంలో 2019 /1 శిక్షాస్మృతులు ఏమాత్రం అమలు చేసిన దాఖలాలు లేవన్నారు గతంలో మాదిరిగానే దుర్మార్గమైన శిక్షాస్మృతులను అమలు చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి వైఖరిని త్వరలోనే అసోసియేషన్ పక్షాన సాక్ష్యాధారాలతో బహిర్గతం చేసి ఆర్టీసీ ఎండి ద్వారకా తిరుమలరావు కలిసి సమస్యలను వివరించి వినతి పత్రం అందించనున్నట్లు సురేష్ బాబు తెలిపారు.

టిడిపిలోకి పేర్ని నాని అనుచరులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం శాసన సభ్యులు పేర్ని నాని ప్రధాన అనుచరుడు వైసిపి యువజన విభాగం అధ్యక్షుడు, మైనార్టీ నాయకుడు ఎస్‌కె జలీల్, అతని అనుచరులు, మరికొంత మంది మైనార్టీలు మాజీ మంత్రి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆధ్వర్యంలో శనివారం చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపిలో చేరారు.

సిపిఐ అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఐదేళ్ళ కాదు.. పదేళ్ళ ఇస్తామని హామీ ఇచ్చిన బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తీవ్ర ద్రోహం చేసిందని ఇండియా కూటమి బలపరిచిన విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క అవకాశం ఇవ్వండి.. అని అధికారంలోకి వచ్చిన వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానులు పేరుతో ఏకంగా రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని చెప్పారు. ఆయన శనివారం స్థానిక 40వ డివిజనులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ నిరంతరం ప్రజల మధ్య ఉంటున్న ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ అభ్యర్థి అయిన తనను కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని జి.కోటేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యదర్శి వర్గ సభ్యులు తాడి పైడియ్య, మూలి సాంబశివ రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



గని మాస్టర్ కుటుంబానికి పరామర్శ



ప్రజాశక్తి - జగ్గయ్యపేట : రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి, యుటిఎఫ్ మాజీ నాయకులు, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు షేక్ ఘని మాస్టర్ ఈ నెల 10న గుండెపోటుతో మృతి చెందిన విషయం విధితమే. ఈ సందర్భంగా శనివారం సిపిఎం మండల, పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి ఆధ్వర్యంలో సిపిఎం బృందం ఘని మాస్టర్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఘని మాస్టర్ కుమారుడు షేక్ సలీం, షేక్ హసీనా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఘని మాస్టారు పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఆర్థికంగా చేయూతను ఇవ్వటంతో పాటు, పార్టీ కార్యాలయం నిర్మాణానికి సైతం తనవంతు సహాయ సహకారాలు అందించారని గుర్తు చేసుకున్నారు. గ్రామంలో విద్యావ్యాప్తికి తన వంతు కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కాకనబోయిన లింగారావు, దంతాల వెంకటేశ్వర్లు, కోటా రవికుమార్ వివి రాంప్రసాద్, భూషమ్మ షేక్ మేరా సాహెబ్ వి రవిశేఖర్, జె వెంకటరావు, షేక్ గౌస్ మియా, భూషమ్మ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని దర్శకుడు వివిఎన్.ఆదిత్య పేర్కొన్నారు. మొగల్రాజపురం పిన్నమనేని పాలి క్లినిక్ రోడ్‌లోని సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో స్పార్క్స్ అలియాంజ 2024 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి దర్శకుడు ఆదిత్య ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రమశిక్షణకు మారుపేరు సిద్ధార్థ ఇన్స్టిట్యూషన్స్ అని ఈ సంస్థల్లో చదివిన ఎంతో మంది విద్యార్థులు వివిధ రంగాలలో ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. సిద్ధార్థ విద్యా సంస్థలు చదువుతోపాటు క్రీడలు సాంస్కృతిక రంగాలకు పెద్దపీట వేస్తాయని తెలిపారు. అనంతరం స్పోర్ట్స్ మీట్‌లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ సునీత మాట్లాడుతూ తమ కళాశాల ఆధ్వర్యంలో ప్రతి ఏడాది స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తామని సుమారు 400 కు పైగా ఫార్మసీ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపించారని తెలిపారు. విజేతలందరికీ బహుమతులు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కన్వీనర్ శ్యామ్ కష్ట , స్పోర్ట్స్ స్టాఫ్ కో - ఆర్డినేటర్ సాయినాథ్, పీడీ వినయ్ శేఖర్ పలువురు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

విద్యుత్ శాఖ ఉద్యోగిపై ఫిర్యాదు

ప్రజాశక్తి - అవనిగడ్డ : ప్రభుత్వ శాఖలో ఉద్యోగం చేస్తూ వైసిపి కార్యకర్తగా పనిచేస్తున్న విద్యుత్ శాఖలోని షిఫ్ట్ ఆపరేటర్ గరికపాటి రాకేష్‌ని ఉద్యోగం నుండి వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు. శనివారం అవనిగడ్డ తహశీల్దార్ కార్యాలయం వద్ద రిటర్నింగ్ అధికారిని కలిసి ఏపి సీపీడీసీఎల్ షిఫ్ట్ ఆపరేటర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ వైసిపి పార్టీకి సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా పని చేస్తున్నాడని రాష్ట్రంలో ఎన్నికల కోడ్ నిబంధనలు ఉన్నప్పటికీ ఫేస్బుక్లో వికాస్ అన్న అభిమాని అనే పేరుతో ఖాతాను ప్రారంభించి తమ నేత మండలి బుద్ధ ప్రసాద్‌పై అసభ్య పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు దీనికి సంబంధించిన ఆధారాలను ఫొటోలతో సహా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందించారు. ఫిర్యాదు చేసిన వారిలో షేక్ బాబావాలి మేడికొండ విజయ్ కంచర్ల ఆనంద్, మోగావత్ గోపీ, గుంటూరు వినయ్, లింగం బాబురావు, చెన్ను బాబురావు కొల్లూరి వాసు కైతేపల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం కోసం ఎదురుచూపు

గతేడాది డిసెంబర్‌లో వచ్చిన మిచౌంగ్ తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. తుపానుతో కృష్ణాజిల్లాలో పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో అధికారం యంత్రాంగం పరిశీలించింది. విపత్తు నిబంధనలకు అనుగుణంగా 33 శాతానికిపైగా నష్టపోయిన బాధిత రైతుల వివరాలను సేకరించి తయారు చేసిన నివేదికలను సోషల్ ఆడిట్ తర్వాత ప్రభుత్వానికి పంపారు. జిల్లాలోని 92,3118 మంది రైతులకు సంబంధించి లక్షా 47 వేల 90 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో బాధిత రైతుల బ్యాంక్ ఖాతాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ఇన్‌పుట్ సబ్సిడీ కింది గత నెల ఆరో తేదీన బటన్ నొక్కి రూ.99.90 కోట్లను జమ చేశారు. అయితే నెలరోజులైనా రైతుల ఖాతాల్లో నగదు జమకాలేదు. దీంతో తుపాను దెబ్బకు నష్టపోయి అప్పులపాలైన రైతులు నష్టపరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. మరోపక్క ప్రభుత్వం ధాన్యం సేకరణ నిలిపివేయడంతో నూర్చిన ధాన్యాన్ని అమ్ముకోలేక రైతులు అవస్థలు పడుతున్నారు. దీంతో రైతులు రోడ్ల పక్కనే ధాన్యం నిల్వ ఉంచాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆర్థిక సంవత్సరం ముగిసిందనే కారణంతో మార్చి 31వ తేదీ

వీక్షణం

తర్వాత ఆర్‌బికెల ద్వారా ధాన్యం సేకరణను ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో రబీలో అపరాల సాగు తర్వాత ఆలస్యంగా నూర్చిన ధాన్యం రైతుల వద్దే ఉండిపోయింది. ప్రయివేటు వ్యాపారులు, మిల్లర్లు మద్దతు ధరకు ఒక్కో బస్తాపైన (75 కిలోల బస్తా) రూ.200 నుంచి రూ.300 వరకు ధర తగ్గించి అడుగుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ఎటూపాలుపోక ధాన్యం సంచులను కాటావేసి రోడ్లపక్కన నిల్వ ఉంచారు. కృష్ణాజిల్లా మొవ్వ మండలం అవురిపూడి గ్రామంలోనే 30 మంది చిన్న, సన్నకారు రైతుల ధాన్యం రోడ్లపక్కన, గ్రామంలోని ఆలయ ప్రాంగణంలోనూ, ఇతర ఖాళీ ప్రదేశాల్లో నిల్వ ఉంచారు. 2 వేల సారలు (సార 45 కిలోల బస్తా) గ్రామంలో వివిధ ప్రాంతాల్లో నిల్వ ఉండిపోయాయి. ఈ ఒక్క గ్రామంలోనే కాదు...పామర్రు, పమిడిముక్కల, ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి మండలాల్లోని పలు గ్రామాల్లో ధాన్యం పెద్దఎత్తున నిల్వ ఉండిపోయింది. అందువల్ల ప్రభుత్వం వెంటనే రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకె) ద్వారా కొనుగోళ్లను కొనసాగించాలని రైతులు కోరుతున్నారు.

- డిఎస్ఆర్‌వి.ప్రసాద్

అగ్రగామిగా కొండపల్లి జడ్‌పి హైస్కూల్ విద్యార్థినులు



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇంటర్మీ డియేట్ ఫలితాల్లో వ్యక్తిగత స్కోరులో ఎన్టీఆర్ జిల్లాలో కొండపల్లి జెడ్‌పి (గర్ల్స్)హై స్కూల్ ప్లస్ విద్యార్థినులు అగ్రగామిగా నిలిచారు. జూనియర్ ఇంటర్ చదువుతున్న ఎమ్‌పిసి విద్యార్థిని ఎన్.కల్యాణి 444/470 మార్కులతోనూ, సిఇసి గ్రూప్‌లో విద్యార్థిని ఎన్.శ్రావణి 446/500 మార్కులతో జిల్లా ప్రథమ స్థానాలు సాధించి హైస్కూల్ ప్లస్‌కు మంచి పేరు సంపాదించి పెట్టారని ఉపాధ్యా యులు కొనియాడారు. నందిగామ ఉప విద్యాశాఖాధికారి ఎ.వెంకటప్పయ్య, పిజిటి.ఉపాధ్యాయ బృందాన్ని అభినందిస్తూ, విజేతలైన ఇరువురి విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ ఇద్దరు ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు బి.పద్మలత పాఠశాల ద్వితీయస్థానం సాధించి విద్యార్థినీ ఆర్.మణితేజతో సహా ముగ్గురిని దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎస్‌ఎమ్‌సి చైర్‌పర్సన్ ఎన్.పుష్ప విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఇంకా మంచి ఫలితాలు వచ్చే సంవత్సరం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రోసరీ ఫిల్మెంట్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : స్వదేశీ ఈ కామర్స్ మార్కెట్‌లో ఫ్లిప్‌కార్డ్ ఆధ్వర్యంలో కిరాణా (గ్రోసరీ) ఫుల్ ఫిల్మెంట్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు సంస్థ వైస్ ప్రెసిడెంట్ హరికుమార్ తెలిపారు. నగరంలోని ఫ్లిప్‌కార్డు స్టోర్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. దీని ద్వారా వినియోగదారులకు వారికి ఎపుడు కావాలంటే అపుడు కిరాణా వస్తువులను డెలివరీ చేయనున్నట్లు తెలిపారు. కిరాణా ఉత్పత్తులతో పాటు డైరీ, గుడ్లు, చాక్లెట్లు, స్టేపుల్స్, క్లీనింగ్ ఎయిడ్స్ వంటి వాటితో పాటు సుమారు 6వేలకు పైగా ఉత్పత్తులను అందించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఫ్లిప్‌కార్డు ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా ఉత్పత్తులను డెలివరీ ఇస్తున్నామని వినియోగదారుల వద్ద నుండి మంచి స్పందన లభిస్తుందన్నారు. ప్రస్తుతం విశాఖతో పాటుగా విజయవాదలో కిరాణా ఫుల్ ఫిలెఓంట్ కేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. రానున్న కాలంలో ఇతర ప్రాంతాలలో కూడా విస్తరించనున్నట్లు తెలిపారు.

అంబేద్కర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : సెయింట్ థామస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఫైన్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత అంబేద్కర్ చిత్రపటమునకు పూలమాలవేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమమునకు అధ్యక్షత వహించిన లయన్ డాక్టర్ రాజు డేవిడ్ దొంతులూరి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విద్య ద్వారా ఎంతటి ఉన్నత స్థానం అయిన చేరుకోవచ్చని నిరూపించారని అన్నారు. తదనంతరం విద్యార్థులచే రాజ్యాంగ పీఠికను చెప్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొనిన లయన్స్ డిస్ట్రిక్ట్ కోశాధికారి లయన్ తుమ్మల రమేష్ బాబు మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా అంబేద్కర్ అందరికీ సమాన హక్కులు కల్పించారని, చేతనైతే ఇతరులకు సహాయం చేయాలి తప్ప హాని తలపెట్టకూడదని చెప్పారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న జోన్ చైర్ పర్సన్ లయన్ మీనవల్లి రాంబాబు మాట్లాడారు. డిజిటల్ క్లాసుల కొరకు పాఠశాలకు టీవీని మీనవల్లి రాంబాబు బహూకరించారు. ఆత్మీయ అతిథిగా కెవిపిఎస్ నాయకులు కర్రే మోజేష్ మాట్లాడారు.

విద్యార్థికి సన్మానం

ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు సెయింట్ థామస్ ఇఎం హైస్కూల్‌లో విద్యనభ్యసించిన చిరంజీవి సత్యాల భువనేష్ ఎం పి సి గ్రూప్ నందు 461 మార్కులు సాధించి రాష్ట్రంలో ఐదో ర్యాంకును సాధించిన సందర్భంగా విద్యార్థిని ఘనంగా సత్కరించి నగదు బహుమతి అందజేశారు.

శామ్‌సంగ్ ఆధ్వర్యంలో 'సాల్వ్ ఫర్ టుమారో'

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన శాంసంగ్ సాల్వ్ ఫర్ టుమారో సీజన్ -3 ప్రారంభించినట్లు సంస్థ ఏరియా మేనేజర్ కె.ఈశ్వర్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని శాంసంగ్ స్టోర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. ఫౌండేషన్ ఫన్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నూతన ఆలోచనలపై ఆసక్తి కలిగించే విధంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. యువతకు వచ్చే ఆలోచనలను విస్తృతం చేయడంతో పాటు వారికి వచ్చే సందేహాలను నివృత్తి చేసేలా ఫౌండేషన్ కృషి చేస్తుందని అందుకే సాల్వ్ ఫర్ టుమారో పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

ప్రసాదం కౌంటర్ తనిఖీ



ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం కొండ పైన గల ప్రసాదం కౌంటర్‌ను ఆలయ కార్యనిర్వహణాధికారి కెఎస్.రామారావు ఆకస్మిక తనిఖీ చేశారు. శనివారం ఆలయ ఇఒ కె.ఎస్.రామరావు కొండపైన ఘాట్ రోడ్‌లోని ప్రసాదం కౌంటర్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. కౌంటరు సిబ్బందితో మాట్లాడి, స్టాక్ వివరాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం కౌంటరు మెరుగైన నిర్వహణకు ఇఒ కౌంటరు సిబ్బందికి సూచనలిచ్చారు.

కెబిఎన్ కళాశాలకు నాక్ ఎ డబుల్ ప్లస్ గ్రేడ్



ప్రజాశక్తి - వన్‌టౌన్ : కాకరపర్తి భావనారాయణ కళాశాల యూజీసీ అనుబంధ సంస్థ నాక్ నుంచి ఏ డబుల్ ప్లస్ గ్రేడ్‌ను సాధించిందని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య, ఆ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసులు చెప్పారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్‌కేపీవీవీ హిందూహైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో 1965లో కేబీఎన్ కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. 59 సంవత్సరాలుగా రాష్ట్రంలో ఉన్నత విద్యారంగ వ్యాప్తికి తద్వారా సామాజిక వికాసానికి కేబీఎన్ కళాశాల అద్వితీయమైన సేవలందిస్తుందని వివరించారు. అదే క్రమంలో అనేక మైలురాళ్లను దాటుకుంటూ నేడు ఆరు వేల మంది విద్యార్థులు రాష్ట్రంలో అతి పెద్ద కళాశాల్లో ఒకటిగా ఘనతకెక్కిందన్నారు. కళాశాలలోని అన్ని అంశాలను పరిశీలించి తగిన గ్రేడింగ్ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ అసిస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ (నాక్) పని చేస్తుందన్నారు. ఈ సంస్థ యూనివర్శిటీ గ్రాంట్ కమిషన్ అనుబంధంగా కొనసాగుతుందన్నారు. నాక్ సంస్థ నియమించిన బందం ఫిబ్రవరి మాసంలో రెండు రోజుల పాటు తమ కళాశాలకు విచ్చేసి పరిశీలన చేసి వెళ్లిందన్నారు. ఆ క్రమంలో నాక్ అందించే అత్యుత్తమ గ్రేడ్ "ఏ డబుల్ ప్లస్" ను తమ కళాశాలకు ప్రకటించిందన్నారు. ఏఏ అంశాలకు ఏ విధమైన మార్కులను కేటాయించినది అనే పూర్తి వివరాలతో నాక్ వెబ్‌సైట్‌లో వివరాలను పొందిపరిచిందని వివరించారు. ఈ సమావేశంలో హిందూహైస్కూల్స్ కమిటీ కోశాధికారి గోళ్ల బాబావిజయకుమార్ కళాశాల కోశాధికారి అన్నం రామకృష్ణారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పిఎల్ రమేష్, డాక్టర్ కె.రామకృష్ణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జీ కష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

తలలో భారీ కణితి తొలగింపు

- బాల్యం నుంచి తల భాగంలో గడ్డతో బాధ పడుతున్న రోగి

- వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరో సైన్సెస్‌లో విజయయవంతంగా శస్త్రచికిత్స

- ఆపరేషన్ అనంతరం వేగంగా కోలుకున్న మోహన్‌రామ్





శస్త్ర చికిత్స వివరాలు తెలుపుతున్న వైద్యులు (ఇన్‌సెర్ట్‌లో) చికిత్స చేసి తొలగించిన కణితి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : నగరంలోని వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరో సైన్సెస్ నందు అద్భుతం ఆవిష్కతమైంది. ప్రపంచంలోనే అత్యంత అరుదైన శస్త్రచికిత్సను ప్రఖ్యాత న్యూరో సర్జన్ డాక్టర్ పువ్వాడ రామకష్ణ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ చికిత్సకు సంబంధించిన వివరాలను తెలియజేసేందుకు బెంజ్ సర్కిల్ సమీపంలోని వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరో సైన్సెస్ నందు శనివారం మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో డాక్టర్ పువ్వాడ రామకష్ణ మాట్లాడుతూ.. 'గుడివాడకు చెందిన మోహన్ రామ్ (40) తల భాగంలో గడ్డతో చిన్న వయసు నుంచి బాధ పడుతున్నారు. గడ్డ వల్ల చాలా ఇబ్బందిగా ఉన్నప్పటికీ, బయటి వ్యక్తులకు తన పరిస్థితి తెలీకుండా టోపీ పెట్టుకునేవాడు. అయితే, ఈ గడ్డ క్రమక్రమంగా పెరుగుతూ అత్యంత భారీ కణితిగా తయారైంది. కణితి రోజురోజుకూ పెరిగిపోతూ, పుర్రె ఎముకలను దెబ్బతీయడంతో మెదడుపై ఒత్తిడి తీవ్రమై పేషెంట్ భరించలేనంత నొప్పి బాధపడ్డాడు. ఆ పరిస్థితుల్లో రోగి, వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరో సైన్సెస్‌లో సంప్రదించాడు. 18 సెంటీమీటర్ల వెడల్పు, 10 సెంటీమీటర్ల పొడవుతో ఉన్న ఈ ట్యూమర్‌ను వైద్యులు గుర్తించారు. దాదాపు నాలుగు గంటల పాటు శ్రమించి, పుర్రె భాగాన్ని ఆపరేషన్ ద్వారా ఓపెన్ చేసి, అతి భారీ కణితిని విజయవంతంగా తొలగించామని వైద్యులు తెలిపారు. ఆపరేషన్ అనంతరం రోగి వేగంగా కోలుకున్నాడన్నారు. ప్రపంచంలోనే ఈ ఆపరేషన్ అత్యంత అరుదైనదన్నారు. ఇది క్యాన్సర్ కణితి కాదని తెలిపారు. పేషెంట్ మోహన్ రామ్ మాట్లాడుతూ 'సుదీర్ఘ కాలంగా వేధిస్తున్న సమస్యను శస్త్రచికిత్స ద్వారా పరిష్కరించిన డాక్టర్ పువ్వాడ రామకృష్ణ నాకు పునర్జన్మను ప్రసాదించారన్నారు. డాక్టర్ పువ్వాడ రవితేజ, అనస్థీషియా విభాగం వైద్యులు డాక్టర్ సూర్య, డాక్టర్ దీప్తిలకు వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరో సైన్సెస్ చైర్మన్ డాక్టర్ గుంటూరు వరుణ్ అభినందనలు తెలిపారు.